తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-03- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 342 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# అమరావతి ఒక నగరం కాదు.. శక్తి

- స్వర్ణాంధ్రప్రదేశ్‌కు శుభ సంకేతం : ప్రధాని మోదీ
- యువత కలలు సాకారమయ్యే రాజధాని
- ఐటీ, హరితశక్తి, విద్యా కేంద్రంగా అభివృద్ధి
- కేంద్ర సహకారంతో మౌలికవసతుల నిర్మాణం
- ఆధునిక పరిశ్రమలకు కేంద్రంగా మారే అవకాశాలు



వివరాలు 2లో..

# పాక్‌పై ఆర్థిక దెబ్బకు భారత్ సన్నద్ధం




- సర్జికల్ స్ట్రైక్స్ తర్వాత ఇప్పుడు ఆర్థిక విధానాల్లో దెబ్బ
- ఉగ్రవాద మూలాలను అణిచేందుకు వ్యూహాత్మక దిశ
- చీకటి ఆర్థిక వ్యవస్థలను ఛేదించేందుకు కంకణం
- విదేశీ నిధుల దుర్వినియోగంపై ఆధారాలు సమర్పణ
- ఐఎంఎఫ్‌పై ఒత్తిడికి భారత్ సిద్ధం

వివరాలు 2లో..



# ఇందిరమ్మ ఇండ్లు

## 600 చదరపు అడుగులకు మించొద్దు

- ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇండ్లు
- ఈనెల 5 నుంచి 20 వతేదీ వరకు 28 మండలాల్లో భూభారతి
- నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గం లోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు.

మిగతా 2లో..

# గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల ల్యాండింగ్

- దేశంలోనే తొలిసారిగా రోడ్డు మీద రాత్రి ల్యాండింగ్
- పహల్గాం దాడికి ప్రతిగా భారత్ సన్నాహాలు
- భారత వైమానికశాఖ ప్రతాపం
- ఫైటర్ జెట్లు, ట్రాన్స్‌పోర్ట్ విమానాల విన్యాసం
- రాత్రి సమయంలో తొలిసారి విజయవంతమైన పరీక్ష
- ఎయిర్‌స్ట్రిప్ వినియోగంలో కీలక ముందడుగు
- సాంకేతిక పర్యవేక్షణతో కట్టుదిట్టమైన భద్రత



**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):**

పహల్గాం దాడి ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం నాటి పాకిస్తాన్ సైనిక విన్యాసాలకు మన సైన్యం దీటుగా బదులిచ్చింది. సంప్రదాయ యుద్ధక్షేత్రాలకు భిన్నంగా నడిరోడ్డుపైనా యుద్ధవిమానాల ల్యాండింగ్, టేకాఫ్ జరిపి వాయుసేన సత్తా చాటింది. అత్యంత అధునాతన శత్రు భీకర రఫేల్‌తో పాటు సుఖోయ్-30, ఎంకేఐ, మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్, సీ-130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్-32 విమానాలతో పాటు ఎంఐ-17 వీ5 హెలికాప్టర్లను కూడా ఈ అధునాతన ఎయిర్‌స్ట్రిప్‌పై ల్యాండింగ్, టేకాఫ్ చేశారు.

మిగతా 2లో..

# తెలంగాణ కులగణన దేశానికి మార్గదర్శి



- కులగణనపై కాంగ్రెస్ పార్టీ పోరాట విజయం
- భారత్ జోడో యాత్రలో రాహుల్ ఉద్యమానికి ఫలితం
- దేశవ్యాప్తంగా కులగణనకు దారితీసిన తెలంగాణ నమూనా
- పారదర్శకంగా, పౌర సమాజంతో కలిసి నిర్వహణ
- కేంద్రానికి అదే విధానం అనుసరించాలన్న సీడబ్ల్యూసీ తీర్మానం
- ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ, తెలుగు రాష్ట్రాల నేతల హాజరు
- కులగణన పూర్తయ్యేవరకు అప్రమత్తత అవసరం
- నాయకులు పర్యవేక్షణ కొనసాగించాలన్న ఖర్గే సూచన

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలో త్వరలో చేపట్టనున్న జనగణనలో కులగణనను చేర్చాలన్న కేంద్ర నిర్ణయం వెనుక కాంగ్రెస్ పార్టీ అద్వితీయ పోరాటం ఉందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పేర్కొంది. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తన భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి చూపించిందని, దేశానికే మార్గదర్శిగా నిలిచిందని కొనియాడింది. తెలంగాణలో అన్ని వర్గాల నుంచి సమాచారం సేకరించి పారదర్శకంగా నిర్వహించిన కులగణన నమూనానే కేంద్రం అనుసరించాలని తీర్మానించింది. దేశంలోని అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అంశాల్లో న్యాయం చేసేలా జనగణనను ఎప్పట్లోగా పూర్తి చేస్తుందో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీ అక్బర్ రోడ్డులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరిగింది.

మిగతా 2లో..

# ట్రంప్ శాంతి మాటలు గుత్తాధిపత్యానికే..

## ట్రంప్ విధానాలు కార్పొరేట్లకు మాత్రమే అనుకూలం- ప్రపంచశాంతికి కాదు



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఉపాధ్యాయ ఉద్యమ జాతీయ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉద్యమ నిర్మాణంలో ప్రముఖులు, యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డ మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన " స్మారకోపన్యాసం"టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన శుక్రవారం ఉదయం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా మాజీ ఎమ్మెల్సీ డ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ హాజరై"ట్రంపు సృష్టిస్తున్న నూతన ప్రపంచం ఎలా ఉండనుంది..?"అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత దాచురి రామిరెడ్డి గారు ఒక గొప్ప మానవతావాది అని మరియు ఆదర్శ ఎమ్మెల్సీ అని అన్నారు.వారితో పని చేసిన అనుభవం మరువలేనిది గుర్తు చేసుకున్నారు. అనంతరం ట్రంప్ విధానాలపై నాగేశ్వర్ మాట్లాడుతూ ట్రంప్ నేడు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ శాంతికి ఏమాత్రం తోడ్పడవని అన్నారు. ఉక్రెయిన్ , రష్యా దేశాల మధ్య యుద్ధ అనుభవాన్ని చూసినట్లయితే అమెరికా యూరోప్ దేశాలతో కలిసి రష్యాపై యుద్ధానికి దిగిన సందర్భంలో రష్యాదేశం ఏకాకి అవుతుందని, రూబుల్ విలువ పడిపోతుందని, రష్యాలో ప్రభుత్వ వ్యతిరేకత వెల్లువెత్తుతుందని మొదట్లో అమెరికా దేశం తప్పుగా అంచనా వేసింది అని అన్నారు.

మిగతా 2లో..

# రేషన్ కార్డుదారులకు శుభవార్త

- పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పునకు ఆమోదం
- ఇప్పటికే 20 శాతం ప్రక్రియ పూర్తి
- మే నెల కోటా విడుదల
- కొత్త సభ్యుల చేరిక దరఖాస్తుల ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర

2లో..






# సింగరేణి ఉద్యోగాల గనిగా మారాలి

- జూన్ 2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు పత్రాల అందజేత
- సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు శ్రమతో కూడిన అడుగులు పడాలి
- సింగరేణి కారుణ్య ఉద్యోగ నియామకాల్లో వయో పరిమితి పెంపు లబ్ధిదారులకు
- ఉద్యోగ పత్రాల అందజేత కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

దశాబ్దాల చరిత్ర ఉన్న సింగరేణి కాలరీస్ ఇక ముందు కూడా అభివృద్ధి పథంలో ముందుకు పోతూ కేవలం బొగ్గు గని గానే కాక వేల మందికి ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని ఆ దిశగా కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు కోరారు.

మిగతా 8లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ కులగణన దేశానికి మార్గదర్శి

(మొదటి పేజీతరువాయి)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి కమిటీ సభ్యులు దామోదర రాజనరసింహ, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. ప్రధానంగా కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడారు.

కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలి: ఖర్గే

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర మొదలు, మొన్నటి లోక్‌సభ ఎన్నికల వరకు ఇదే అంశాన్ని ముందుపెట్టి కాంగ్రెస్ పార్టీ పోరాడిందని ఖర్గే చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణన పూర్తి చేసి ప్రభుత్వ పథకాల్లో అమలు చేసే ప్రక్రియను సైతం మొదలు పెట్టిందని ప్రశంసించారు. ప్రజల సమస్యలను నిజాయితీగా లేవనెత్తితే, ఎన్డీఏ వంటి మొండి ప్రభుత్వాలు తలవంచాల్సిందేనని రాహుల్‌గాంధీ నిరూపించారని అన్నారు. అయితే కులగణన సమస్యను ఒక మంచి ముగింపు వచ్చేంత వరకు కాంగ్రెస్ నేతలంతా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఇదే అంశంపై చేసిన తీర్మానంలోనూ తెలంగాణ అంశాన్ని సీడబ్ల్యూసీ ప్రస్తావించింది.


తెలంగాణ నమూనాను కేంద్రం అనుసరించాలి

'తెలంగాణలో కులగణనకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం పాటించిన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అవసరం ఉందని సీడబ్ల్యూసీ భావిస్తోంది. తెలంగాణలో కుల సర్వే రూపకల్పన పూర్తిగా పౌర సమాజం, సామాజికవేత్తలు, నాయకుల క్రియాశీల ప్రమేయంతో.. సంప్రదింపులు, పారదర్శక ప్రక్రియ ద్వారా జరిగింది. ఈ సర్వే పూర్తిగా బ్యూరోక్రాటిక్ విధానంలో కాకుండా ప్రజల పరిశీలన నుంచి వచ్చింది.

అందువల్ల జాతీయ స్థాయి కులగణన కోసం తెలంగాణ పాటించిన విధానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతోంది. కేంద్రం విశ్వసనీయమైన, శాస్త్రీయమైన, భాగస్వామ్య నమూనాను రూపొందించేందుకు వీలుగా మా పూర్తి మద్దతును ప్రకటిస్తున్నాం. సంప్రదింపులు, జవాబుదారీతనం సమ్మిళితత్వంతో విలువలను ప్రతిబింబించే చట్రాన్ని రూపొందించడంలో సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..'అని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో పేర్కొంది.

**జాప్యం వద్దు..పారదర్శకంగా జరగాలి**

'కులగణన ప్రక్రియలో జాప్యం చేయకూడదు. అన్ని రాజకీయ పార్టీలను పూర్తి విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ అంశంపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ జరపాలి. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులను కేటాయించి, జనాభా లెక్కల ప్రతి దశకు నిర్దిష్టమైన సమయాన్ని ప్రకటించాలి. కులగణన వివరాల నమోదు ప్రక్రియ పూర్తి సమగ్రంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలి. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు, విద్యా, ఉపాధి అవకాశాలకు ఈ కులగణనే ప్రాతిపదికగా ఉండాలి. కుల గణన సరిగ్గా జరిగి అమలైతే సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది..'అని తీర్మానంలో స్పష్టం చేసింది.

**పూర్తి పారదర్శకతతో నిర్వహించాం: సీఎం రేవంత్**

తెలంగాణలో కులగణన జరిగిన తీరును సీడబ్ల్యూసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. కచ్చితత్వంతో, పూర్తి పారదర్శకంగా కులగణన నిర్వహించామని తెలిపారు. 'బీసీల జనాభా గతం కన్నా 6 శాతం మేర పెరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని పార్లమెంట్ ఆమోదానికి పంపించాం. విద్య, ఉద్యోగం, ఉపాధి, నిధుల కేటాయింపుల్లో ఓబీసీ, ఆదివాసీ, దళితులు, మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఇకపై ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి.

కులగణనతో ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని మేము విశ్వసిస్తున్నాం. మమ్మల్ని చూసే కేంద్రం కూడా కులగణన చేసేందుకు ముందుకొచ్చింది. దీనిపై రాష్ట్రంలోని నిమ్న వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి..'అని సీఎం తెలిపారు. రేవంత్, దామోదరకు అభినందనలు కులగణన ప్రక్రియలో చేసిన శ్రమ, అమలులో చూపిన చొరవపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరలను సీడబ్ల్యూసీ కీలక నేతలు అభినందించారు.

# రేషన్ కార్డుదారులకు శుభవార్త

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

రేషన్ కార్డుదారుల పరేషాన్‌కు ఇక తెరపడనుంది. లబ్ధిదారులకు శుభవార్త. సరిగ్గా ఎనిమిదేళ్ల నిరీక్షణకు మోక్షం లభిస్తోంది. పాత రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల(యూనిట్) ఆమోద ప్రక్రియ ఆరంభమైంది. పౌర సరఫరాల శాఖ ఆన్‌లైన్ ద్వారా కొత్త సభ్యుల చేర్పుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలిస్తూ ఒక్కొక్కటిగా ఆమోదిస్తోంది. అయితే రేషన్‌కార్డు (Ration Card) కలిగిన కుటుంబంలోని కొత్త సభ్యుల పేర్లను ఆమోదిస్తున్నప్పటికీ ఏడేళ్ల వయసు దాటిన వారికి మాత్రమే రేషన్ కోటా కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పెండింగ్ దరఖాస్తుల్లో సుమారు 20 శాతం మేర పరిష్కరించి మే నెల రేషన్ కోటా కూడా కేటాయించింది. మిగతా దరఖాస్తులను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపట్టింది.

**ఆరు లక్షలపైనే కొత్త సభ్యులు..**

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిరిగి జిల్లాల్లో పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం సుమారు మూడు లక్షలపైనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డుల్లోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం అతీగతీ లేదు. ఈ వ్యవధిలో ఉమ్మడి కుటుంబాలు రెండు, మూడుగా ఏర్పడగా, మరోవైపు కుటుంబంలో మరి కొందరు కొత్త సభ్యులుగా చేరారు.



సుమారు మూడు లక్షల కుటుంబాలు ఆరు లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుండగా, మొన్నటి వరకు ఆమోదించే ఆప్షన్ లేకుండా పోయింది. అయితే రేషన్‌కార్డులోని సభ్యుల తొలగింపు ఆప్షన్ మాత్రం కొనసాగుతూ వస్తోంది. తాజాగా కొత్త సభ్యులు చేర్పుల ఆప్షన్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆమోద ప్రక్రియ ప్రారంభమైంది.

# ఇందిరమ్మ ఇండ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

(మొదటి పేజీతరువాయి)

తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణరావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లతో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్1, లిస్ట్2 , లిస్ట్3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.5 నుంచి 20వ తేదీవరకు.. గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని , పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు విద్యార్ధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్ధులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు ఓ ఆర్ ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్ధులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశం లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి. ఎల్. ఎ డైరెక్టర్ మకరంద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి, వి.పి.గౌతమ్ , లా ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

# గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల ల్యాండింగ్

(మొదటి పేజీతరువాయి)

ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఈ ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలకు వేదికైంది. పగటి పూటే గాక అవసరమైతే కారు చీకట్లోనూ నిర్భీతిగా యుద్ధవిమానాలను రోడ్లపై కూడా దింపగలమని వాయుసేన నిరూపించింది. 594 కిలోమీటర్ల పొడవైన గంగా ఎక్స్‌ప్రెస్ వేలో జలాలాబాద్ సమీపంలోని పిరూ గ్రామం వద్ద నిర్మించిన 3.5 కిలోమీటర్ల పొడవైన ఎయిర్‌స్ట్రిప్‌పై శుక్రవారం రాత్రి ఎయిర్‌ఫోర్స్ యుద్ధవిమానాలు ఇలా ల్యాండై అలా టేకాఫ్ తీసుకున్నాయి. తద్వారా దేశంలో పగలు, రాత్రి తేడా లేకుండా అన్నివేళలా ఫైటర్‌జెట్ల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువైన తొలి ఎక్స్‌ప్రెస్‌వే గా ఈ మార్గం నిలిచింది.

**తొలిసారిగా శుక్రవారమే పరీక్ష**

గంగా ఎక్స్‌ప్రెస్ వే ఎయిర్‌స్ట్రిప్‌ను శుక్రవారమే తొలిసారిగా పరీక్షించారు. ఎయిర్‌ఫోర్స్ విభాగంలోని టాప్ ఫైటర్లు దీన్ని వినియోగించాయి. గంగా ఎక్స్‌ప్రెస్ వే ఇప్పటికే 85 శాతం నిర్మాణం పూర్తయింది. యూపీలో ఆగ్రా-లఖ్‌నవూ, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేల మీదా ఎయిర్‌స్ట్రిప్‌లను నిర్మించారు. గంగా ఎక్స్‌ప్రెస్ వే మీద మాత్రమే ప్రస్తుతానికి రాత్రివేళ ఆపరేషన్‌కు అనువుగా అధునాతన లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను సిద్ధంచేశారు. ఈ ఎయిర్‌స్ట్రిప్‌ను సంఘవ్యతిరేక శక్తులు పాడుచేయకుండా కనిపెట్టేందుకు 250కి పైగా సీసీటీవీ కెమెరాలను అమర్చారు. ఎయిర్‌స్ట్రిప్ పరీక్షను స్వయంగా తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు, వందలాది మంది పాఠశాల విద్యార్థులు వచ్చారు. రక్షణ శాఖ, యూపీ రాష్ట్ర అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.


రోజంతా చక్కర్లు

రాత్రిపూట ల్యాండింగ్, టేకాఫ్‌కు ముందు పగటి పూట యుద్ధ విమానాలను ఎయిర్‌స్ట్రిప్‌పై చాలాసార్లు విజయవంతంగా దింపారు. యుద్ధ సమయాల్లో వైమానిక స్థావరాలు, రన్‌వేలను శత్రు విమానాలు ధ్వంసం చేస్తే అత్యవసరంగా యుద్ధ విమానాలను దించడానికి, మళ్లీ సమరానికి సిద్ధమై వెనువెంటనే టేకాఫ్ తీసుకోవడానికి వీలుగా ఎక్స్‌ప్రెస్ వేలపై ఇలా ఎయిర్‌స్ట్రిప్‌లను నిర్మిస్తున్నారు. యుద్ధ సమయాల్లో సైనికులు, ఆయుధాలు, సైనిక ఉపకరణాలను మోసుకెళ్లే భారీ సరకు రవాణా విమానాలు సైతం దిగేలా వాటిని అత్యంత పటిష్టంగా నిర్మించారు.

# పాక్‌పై ఆర్థిక దెబ్బకు భారత్ సన్నద్ధం

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ స్ట్రైక్స్ చేసి డజన్లకొద్దీ ముష్కరులను అంతమొందించిన భారత ఇప్పుడు పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలపై కోలుకోలేని దెబ్బ కొట్టాలని కంకణం కట్టుకుంది. అందులోభాగంగా విదేశీ నిధులను పాక్ సర్కార్ ఉగ్ర కార్యకలాపాలు, సీమాంతర ఉగ్రవాదం, ఇతర చీకటి పనులను కేటాయిస్తోందని నిరూపించడం ద్వారా విదేశీ సాయం నిలిచిపోయేలా చేయాలని భారత్ యోచిస్తోంది.

ఇందుకోసం ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)పై భారత్ తీవ్ర స్థాయిలో ఒత్తిడిచేయనుంది. ఈ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 'గ్రే'జాబితాలోకి చేరితే ఆయా దేశాలకు అంతర్జాతీయ సాయం, నిధుల మంజూరు, విదేశాల మద్దతు, విదేశీ పెట్టుబడులు రావడం చాలా కష్టమవుతుంది. దీనికితోడు ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ద్వారా పాకిస్తాన్‌కు రాబోయే వందల కోట్ల విలువైన నిధులను అడ్డుకుని పాక్‌ను ఆర్థిక కష్టాల కడలిలో ముంచాలని మోదీ సర్కార్ తీవ్రంగా శ్రమిస్తోంది.

**గతంలో పాక్‌పై గ్రే లిస్ట్ కొరడా**

విదేశీ నిధులను పూర్తిగా దేశాభివృద్ధికి కోసం కేటాయించకుండా అందులో కొంత మొత్తాలను ఉగ్ర సంబంధ కార్యకలాపాలకు వెచ్చించినట్లు పాకిస్తాన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇవి నిజమని తేలడంతో పాక్‌ను 2018 జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ తన గ్రే లిస్ట్‌లో పెట్టింది. దీంతో విదేశీ సాయం అందక పాక్ తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంది. దీంతో బుద్ధి తెచ్చుకున్న పాకిస్తాన్ తన ఉగ్రకార్యకలాపాలకు నిధుల్లో కోత పెట్టింది. పలువురు ఉగ్రవాదులను అరెస్ట్‌చేసింది.

దీంతో ఎట్టకేలకు 2022 అక్టోబర్‌లో గ్రే జాబితా నుంచి పాకిస్తాన్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు సైతం ఇలాగే పాకిస్తాన్‌ను గ్రే జాబితాలోకి చేర్చేలా ఎఫ్ఏటీఎఫ్‌పై మోదీ సర్కార్ ఒత్తిడిని పెంచింది. ఎఫ్ఏటీఎఫ్‌లో 40 సభ్యదేశాలున్నాయి. వీటిలో భారత్ తన అత్యంత స్నేహశీల దేశాల ద్వారా ఈ పని ముగించాలని చూస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశాలు ఏటా ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లో జరుగుతాయి. ఈ జూన్ సెషన్‌లో ఈ మేరకు మద్దతు కూడగట్టేందుకు మిత్రదేశాలతో భారత్ ఇప్పటికే సంప్రదింపులు మొదలెట్టినట్లు వార్తలొచ్చాయి.

**ఐఎంఎఫ్‌పైనా కేంద్రం ఒత్తిడి**

స్వదేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, తగ్గిపోయిన విదేశీ పెట్టుబడులతో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న పాకిస్తాన్ దేశపాలన కోసం తరచూ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థపై ఆధారపడుతోంది. దీంతో వచ్చే మూడేళ్లలో 7 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఐఎంఎఫ్ ఒప్పుకుంది. ఈ నిధులొస్తే పాక్ వాటిని ఉగ్రకార్యకలాపాలకు దుర్వినియోగం చేయనుందని భారత్ ఐఎంఎఫ్ ఎదుట ఆందోళన వ్యక్తంచేయనుంది. భారత వాదన నెగ్గితే ఈ నిధులు ఆగిపోవడమో, తగ్గిపోవడమో జరగొచ్చు. నిధుల విస్తరణపై మే 9వ తేదీన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, పాక్ ఉన్నతాధికారుల మధ్య తొలి సమీక్ష సమావేశం జరగనుంది.

పాకిస్తాన్‌కు నిధుల మంజూరుపై పునరాలోచన చేస్తే మంచిదని ఇతర అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు, సంఘాలను సైతం భారత్ కోరబోతోంది. ప్రజాపనుల రుణాలు, సాంకేతిక సహకారానికి సంబంధించి మొత్తంగా 764 పనులకు గాను ఏకంగా 43.7 బిలియన్ డాలర్ల నిధులను పాక్‌కు ఇచ్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్ణయించింది. ఇప్పటికే 9.13 బిలియన్ డాలర్ల రుణాలిచ్చింది. నాలుగు నెలల క్రితం ప్రపంచ బ్యాంక్ సైతం పాకిస్తాన్‌కు 20 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది.

## ట్రంప్ శాంతి మాటలు గుత్తాధిపత్యానికే

(మొదటి పేజీతరువాయి)

ఉక్రెయిన్ లో సగానికి పైగా రష్యా ఆక్రమించడంతో ఓటమి దిశగా వెళుతున్న సందర్భంలో రష్యాతో యుద్ధం విరమించాలని శాంతి సందేశమంటూ అమెరికా దేశ నూతన అధ్యక్షులు ట్రంపు కొత్త నినాదాన్ని ముందుకు తీసుకొచ్చారు. అంతేకాకుండా ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఇదేవిధంగా కొనసాగితే రష్యా దేశం చైనా దేశానికి దగ్గరవుతుందని భావనతో అగ్రదేశంగా కొనసాగాలని ఉద్దేశంతో చైనా ను ఆర్థికంగా దెబ్బతీయడానికి మళ్లీ రష్యా దేశానికి ట్రంప్ దగ్గరవడం గమనించదగ్గ పరిణామం. ఇది శాంతికి దోహదపడే అంశం కాదు. కేవలం అగ్రరాజ్యంగా అమెరికా కొనసాగడానికి మాత్రమే ట్రంపు చర్యలు తోడ్పడుతున్నట్టుగా కనిపిస్తుందని అన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో పెద్ద ఎత్తున దోచుకోవడానికి ప్రయత్నం జరుగుతున్నది. సుంకాల పేరుతో ప్రపంచ దేశాలన్నిటిని తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నాడు. అమెరికాలో ఉన్న కొంతమంది పెట్టుబడిదారులతో ఏకమై అగ్రరాజ ఆధిపత్యాన్ని కొనసాగించాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. నేటి ప్రపంచ ఆర్థిక విధానం డాలర్ తో మాత్రమే ముడిపడి ఉన్నది. భవిష్యత్తులో ట్రంప్ విధానాలు ఇదేవిధంగా కొనసాగితే డాలర్ కు ప్రత్యామ్నాయంగా మరొక కరెన్సీ ముందుకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ట్రంపు విధానాలు ఇదే విధంగా కొనసాగితే ప్రపంచంలోని కొన్ని దేశాలు కలిసి అమెరికాకు ప్రత్యామ్నాయంగా కూటమిలుగా ఏర్పడే అవకాశం ఉందని అన్నారు.

# అమరావతి ఒక నగరం కాదు.. శక్తి

అమరావతి, (తెలంగాణ ముచ్చట్లు):

అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ (PM Modi) అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. ''దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్యభూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది'' అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

**చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు..**

''టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు నన్ను ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది'' అన్నారు.

**పవన్ జీ.. ఇది మనమే చేయాలి..**

''ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా'' అన్నారు.




''ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుంది'' అని చెప్పారు.

**కనెక్టివిటీకి కొత్త అధ్యాయం..**

''ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పదిరెట్లు అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం''.



## ఘనంగా భద్రకాళి అమ్మవారు, భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం

**పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్ ప్రావీణ్య,మేయర్ గుండు సుధారాణి**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
వరంగల్ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి అమ్మవారు, భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భద్రకాళి అమ్మవారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. భద్రకాళి, భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని భక్తులతో కలిసి వారు తిలకించారు. వేద పండితులు అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి అమ్మ వారి కళ్యాణోత్సవంలో పుర ప్రముఖులతో పాటు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పంట మార్పిడి విధానంతో
# అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చు..

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు**

**రైతులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటలను సాగు చేయాలి**

**ఈదురు గాలులు, అకాల వర్షా లతో దెబ్బతిన్న బొప్పాయి తోటలను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పంట మార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చని, అకాల వర్షాల వల్ల దెబ్బతినని ఆయిల్ పామ్ వంటి లాభాసాటి పంటను రైతులు సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.
శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాధపాలెం మండలం సూర్య తండాలో గురువారం నాటి అకాల వర్షం, తీవ్రమైన గాలులకు దెబ్బతిన్న బొప్పాయి తోటలను, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా *మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ* అకాల వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 25 వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని, గత రెండు, మూడు రోజులుగా కురిసిన రాళ్ల వాన, అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలపై కలెక్టర్లు నివేదికలు పంపారని మంత్రి తెలిపారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు తాత్కాలిక సహాయం అందిస్తూ, ఏప్రిల్, మే నెలలో వచ్చే రాళ్ళ వానలకు పంట నష్టపోకుండా ఉండాలంటే



ఆ కాలంలో తగిన పంటలు సాగు చేయాలని మంత్రి తెలిపారు. బొప్పాయి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు నష్టపోతున్నాయని, ప్రభుత్వం అందించే పరిహారం సరిపోవడం లేదని, రైతు నష్టపోకుండా ఉండాలంటే పంట కాలం, పంటలు మార్చుకోవాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ వేసిన రైతులు అకాల వర్షాలతో నష్టపోవడం లేదని, రైతులందరూ ఆలోచన చేసి లాభసాటి పంటలు సాగు చేయాలని అన్నారు. పంట మార్పిడి విధానం తప్పని సరిగా అమలు చేయాలని అన్నారు. నష్టం జరిగిన రైతులకు తాత్కాలికంగా ప్రభుత్వం తరఫున సహాయం అందిస్తామని, భవిష్యత్తులో ఇటువంటి నష్టాలు జరగకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలని ఏర్పాటు చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్) ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా రెవెన్యూ మండలాల ప్రాతిపదికగా రైతు పరపతి సేవల కోసం



పిఎసిఎస్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఇదే సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఆత్మకూరు మండలం పెంచికలపేట, పెద్దాపూర్, శాయంపేట మండలం శాయంపేట, ధర్మసాగర్ మండలం ధర్మసాగర్, కమలాపూర్ మండలం కమలాపూర్, కాజీపేట మండలం కాజీపేట దర్గా, హసన్పర్తి మండలం వంగపహాడ్ ఏరియాలలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు, జన ఔషధీ కేంద్రాలు, పెట్రోల్ బంకులు, రైతులకు ఉపయోగపడే విధంగా గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు.
ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, నాబార్డ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ నజీర్ సుల్తాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలి

- **అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు పెన్నులు,పెన్సిళ్లు తీసుకురావొద్దు**
- **పరీక్షా కేంద్రంలోనే అభ్యర్థులకు పెన్నులు అందజేత**
- **ఈ నెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష**
- **అభ్యర్థులకు పలు సూచనలు చేసిన కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** ఈ నెల 4వ తేదీన (ఆదివారం) నీట్ పరీక్ష జరగనుందని, పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అనుమతిస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షకు సంబంధించి పరీక్ష రాసే అభ్యర్థులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.
నీట్ పరీక్ష నిర్వహణకు హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలు, వరంగల్ పరిధిలో 1పరీక్షా కేంద్రాన్ని కేటాయించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలోనికి అభ్యర్థులు ప్రవేశించేందుకు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు అనుమతిస్తారని పేర్కొన్నారు. నియమిత సమయం దాటిన తర్వాత విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేనందున అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష గదికి వెళ్లే ముందు బయోమెట్రిక్ అటెండెన్స్, రిజిస్ట్రేషన్, తనిఖీ ప్రక్రియ ఉంటుంది కాబట్టి మధ్యాహ్నం1:30 లోగానే చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డులో ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మరొక పోస్ట్ కార్డు సైజు ఫోటోను అడ్మిట్ కార్డుకు అతికించాలని అన్నారు. అదనంగా మరొక పాస్పోర్ట్ సైజ్ ఫోటోను వెంట తెచ్చుకోవాలన్నారు. అప్డేటెడ్ ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. లేటెస్ట్ ఫోటోతో కూడిన ఐడి ప్రూఫ్ ను అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి తీసుకురావాలన్నారు. దివ్యాంగులు ధ్రువీకరించిన సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు పెన్సిళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని సూచించారు. పరీక్షా కేంద్రంలోని అభ్యర్థులకు పెన్నులను అందజేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ వంటివి అనుమతించబడవని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీట్ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య వెల్లడించారు.



## భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను
# వేగవంతం చేయాలి..

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
- **ఖమ్మం భూగర్భ డ్రైనేజ్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం మురుగు నీటి పైప్ లైన్ భూగర్భ డ్రైనేజ్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 249.5 కోట్లతో భూగర్భ డ్రైనేజ్ పనులను అమృత్ 2 పథకం క్రింద మంజూరు చేసుకోవడం జరిగిందని, వీటిలో 189 కోట్ల 50 లక్షల రూపాయలు భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం, 60 కోట్ల రూపాయలు రాబోయే 10 సంవత్సరాలకు వాటి నిర్వహణకు కేటాయించడం జరిగిందని అన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో డ్రైనేజ్ లైన్ 8.5 కిలోమీటర్లకు గాను 1.54 కిలోమీటర్లు, 432 మ్యాన్ హోల్స్ నిర్మాణానికి గాను 73 మ్యాన్ హోల్స్ నిర్మాణం పూర్తి చేశారని అన్నారు. ధంసలాపురం చెరువు వద్ద 44 ఎం.ఎల్.డి సామర్థ్యంతో, పుట్టకోట చెరువు వద్ద 9.5 ఎం.ఎల్.డి సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ జరుగుతుందని అన్నారు.
మురుగు నీటి కాల్వల 2.5 కిలోమీటర్ల వరకు ఎటువంటి నిర్మాణాల తొలగింపు లేకుండా పూర్తి చేయవచ్చని, 1.5 కిలో మీటర్ వరకు ప్రస్తుతం పూర్తయిందని, పెండింగ్ కిలో మీటర్ నిర్మాణం అదనపు బృందాలు ఏర్పాటు చేసి పూర్తి చేయాలని అన్నారు. టౌన్ ప్లానింగ్, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయి పర్యటించి అవసరమైన పరీక్షలు పూర్తి చేసి, మురుగు నీటి కాల్వల నిర్మాణం అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పనులలో ఆశించిన స్థాయిలో పురోగతి రాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.
మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు వేగవంతం కాకపోతే చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, డిఇ, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మే 5 నుంచి 20 వరకు జిల్లాకు ఒక మండలంలో

# రెవెన్యూ సదస్సులు నిర్వహణ

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మే నెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి
- భూ సేకరణ జరిగిన భూముల వివరాలు అప్ డేట్ చేయాలి
- నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు
- అర్హుల కు ఇందిరమ్మ ఇండ్ల పథకం కేటాయించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి





**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

భూ భారతి చట్టం రూల్స్ ప్రకారం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ లతో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ,* ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లా లలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై ప్రజల నుంచి 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. భవిష్యత్తులో జరిగే రాష్ట్రవ్యాప్త రెవెన్యూ సదస్సులు సుమారు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.

భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ భూములలో పొజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పోజిషన్ లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

పట్టాలు ఉండి పొజిషన్ లో లేని దరఖాస్తులను కూడా పరిశీలించాలని అన్నారు. హై కోర్టు నుంచి అనుమతి రాగానే సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

భూ సర్వే కు సంబంధించిన సమస్యలు, ఆర్.ఎస్.ఆర్ ఎక్సస్ సమస్యలు పరిష్కరించాలని, భూ సేకరణ కింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులు అప్ డేట్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సులు వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు.

గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద లైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో చిన్న మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు. ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. పి.ఎం.ఎల్.ఏ పోర్టల్ లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నెంబర్ లతో పూర్తి చేయాలని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు మొదటి విడత కింద 700 కోట్ల పైగా నిధులు వస్తాయని అన్నారు.

600 చదరపు అడుగులు కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే మనకు కేంద్ర ప్రభుత్వం నిధులు రావని, లబ్ధిదారులకు వివరించి రెండవ దశలో 600 చదరపు అడుగుల లోపు కట్టేలా చూడాలని అన్నారు.

పైలెట్ గ్రామాలలో మనం మంజూరు చేసిన 51 వేల ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయని, 2019 ఇండ్లు బేస్మెంట్ పూర్తి చేసుకుంటే ఇటీవలే లక్ష రూపాయలు విడుదల చేశామని, ఇంటి నిర్మాణాలలో పురోగతి రావాల్సిందేనని, కలెక్టర్లు హౌసింగ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

హౌసింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ప్రతిరోజు ఇంచార్జి మంత్రులతో సమన్వయం చేస్తూ అర్హుల జాబితా ప్రకటించి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మే 10వ తారీఖు లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వార్త పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు రిజెండర్ జారీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ప్రజలకు చెల్లింపులు సకాలంలో అందుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న *ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ,* భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను చట్టం ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుల స్క్రూటిని మార్గం సుగమం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి భూ భారతి సమస్యల పరిష్కారం చేపట్టాలని అన్నారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రంలోనే 24 జిల్లాల పరిధిలో 190 పరీక్షా కేంద్రాలలో నీట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని , 72 వేల 507 అభ్యర్థులు పరీక్షలు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరో సారి పున:రావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సిఎస్ కలెక్టర్లకు సూచించారు.


నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లా స్థాయిలో చేస్తున్న ఏర్పాట్ల గురించి అభ్యర్థులకు తెలిసే విధంగా పత్రికల, మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇండ్లని, ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మమైన కార్యక్రమం అని, అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకం అవుతుందని, అనర్హులకు పథకం అందితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సి.ఎస్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా మనకు సహాయం అందే విధంగా మార్గదర్శకాలను పాటించాలని సిఎస్ అధికారులకు తెలిపారు.

*హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య* మాట్లాడుతూ జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4680 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతున్నారని, దీనికి సంబంధించిన శాఖల వారితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామని, విద్యార్థులకు సరిపోవు బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేశామన్నారు, పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు ఈ వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రవీందర్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసులు, నడికూడ తహసీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు

## వరంగల్ సందర్శనకు వివిధ దేశాల సుందరీమణుల

# పటిష్ట భద్రత ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఈ నెల 14న వరంగల్ రాక
- వేయిస్తంభాల దేవాలయం, ఫోర్ట్ సందర్శించనున్న సుందరీమణులు
- హనుమకొండ,వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద



**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ఈనెల 14వ తేదీన వరంగల్ పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హైదరాబాద్ లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ఈ నెల 14వ తేదీన వరంగల్ సందర్శన నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఇతర అధికారులతో సందర్శన ఏర్పాట్లు, భద్రత, పర్యటన ప్రాంతాల వద్ద ఏర్పాట్లు, తదితర అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థ షోబోట్ ప్రతినిధులు వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు సందర్శించే ప్రదేశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుండి హనుమకొండ హరిత కాకతీయ హోటల్ కి చేరుకుంటారని, అక్కడ వారికి స్వాగతం, బతుకమ్మ ఆట పాట కార్యక్రమం ఉంటుందన్నారు. వారి రాక సందర్భంగా పోలీస్ భద్రత పటిష్టంగా ఉండాలని అన్నారు. హరిత కాకతీయ నుండి వేయి స్థంబాల దేవాలయానికి చేరుకుని దైవ దర్శనం చేసుకుంటారని, ఆలయం వద్ద బ్యారికేడ్ల ఏర్పాటు చేయాలని, ఆలయ విశిష్టతను తెలియజేసేందుకు గైడ్ అందుబాటులో ఉండాలన్నారు. అక్కడ ఫోటో షూట్, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ షో బోట్ ప్రతినిధి , పోలీస్, పర్యాటక, ఇతర అధికారులతో చర్చించారు. చారిత్రక వేయి స్థంభాల దేవాలయం సందర్శన అనంతరం ఫోర్ట్ వరంగల్ ను సందర్శిస్తారని పేర్కొన్నారు. ఆ తదుపరి హరిత కాకతీయ కు చేరుకుని డిన్నర్ అనంతరం హైదరాబాద్ కు బయలుదేరుతారని అన్నారు.

ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఈస్ట్ జోన్ డీసీపి అంకిత్ కుమార్, ఏఎస్పీ మనన్ భట్, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, పర్యాటకశాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విపత్తు నష్ట నివారణకు ముందస్తు

# కార్యాచరణ ప్రణాళిక చేయాలి..

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.
- అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- విపత్తు నిర్వహణపై పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

విపత్తుతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి, విపత్తు నిర్వహణపై రెవెన్యూ, ఇర్రిగేషన్, పంచాయతీ రాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు హెడ్ క్వార్టర్స్ లో ఉంటూ, సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల,మునిసిపాలిటీ స్థాయిలో వారి, వారి పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని సరిదిద్దాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉన్న వారిని ముందురోజు సురక్షిత ప్రాంతానికి చేర్చాలని, ఇందుకు ప్రతి గ్రామంలో ఒక భవనాన్ని గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి మురికికాల్వను ప్రారంభం నుండి తుది వరకు పరిశీలించి, పద్ద వర్షం బయటకు వెళ్తుందా చూడాలని, ప్రతి మురికికాల్వకు డిసిల్టింగ్ చేసి, ఎక్కడా నీరు ఆగకుండా వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆపద మిత్ర క్రింద యువతి, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు, జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను ఆపద మిత్ర క్రింద ఎంపిక చేసి 10 రోజుల క్లాస్ రూమ్ శిక్షణ, క్షేత్ర శిక్షణ ఇచ్చి, వైద్య పరీక్షలు చేపట్టి వారికి ఫిట్ నెస్ పరీక్షలు చేసి, జీవిత భీమ చేయించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుండిఅధికారులు, ఆపదమిత్ర, ఫిషర్ మెన్, ఈతగాళ్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి సమాచారం అందిపుచ్చుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామం/ వార్డు లో పోర్టబుల్ మైక్ సెట్ సిద్ధం చేసుకోవాలని, విపత్తు సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి వినియోగించేలా ఉంచాలని అన్నారు. ఇది వరకే మైక్ సెట్ ఉన్నచోట, వాటి పనితీరు చూసి, బ్యాటరీ, ప్రత్యామ్నాయ పవర్ సప్లయ్ కి చర్యలు చేపట్టి, ఉపయోగానికి సిద్ధం చేయాలన్నారు. పారిశుద్ధ్య వాహనాల లో సైతం రికార్డు సమాచారం ప్రచారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామం/వార్డ్ వారీగా ప్రభావిత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలింపుకు పునరావాస కేంద్రాల గుర్తింపు చేసి, కావాల్సిన దుప్పట్లు, తదితర సామాగ్రి సిద్ధం చేయాలన్నారు. ప్రతివారం ఆయా సామాగ్రి పరిస్థితిని తనిఖీ చేయాలని, పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన సామాగ్రిని 15 జూన్ నుండే ప్యాకింగ్ చేసుకొని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే తరలింపుకు సిద్ధంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టీసీ బస్సులతో బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పర్యాటకులను ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామం, మండల వారీగా అనుభవజ్ఞులైన ఫిషర్ మెన్, గజ ఈతగాళ్ల జాబితా ఇవ్వాలని, వీరికి గల పడవలు, తెప్పల వివరాలు పొందుపర్చాలని కలెక్టర్ అన్నారు. విపత్తులను ఎదుర్కోవడానికి జూన్ 15 నుండి సెప్టెంబర్ 15 వరకు వీరిని తహశీల్దార్ల ఆధీనంలో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ దళాలను కలెక్టరేట్ వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. టూరిజం, ఫిషర్ మెన్ ల వద్ద గల పడవలకు తనిఖీలు చేసి, ఇంధనంతో అన్ని రకాలుగా సిద్ధపర్చాలనీ అన్నారు. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్ లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్నచోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రాల్లో 1077 నెంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని, ఇందుకై సమర్థ సూపరింటెండెంట్ ని బాధ్యునిగా చేసి, కావాల్సిన అధికారులను నియమించాలన్నారు. మండల కేంద్రాల్లో ల్యాండ్ లైన్ ఫోన్లను క్రియాశీలం చేసి, కంట్రోల్ రూం ల ఏర్పాటు చేయాలన్నారు.

సమావేశంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, గత అనుభవం దృష్ట్యా ఏం జరిగింది, ఏం చేసాం, ఏం చేయాలనే ఆలోచన చేయాలన్నారు. ప్రతి శాఖ నుండి విపత్తు నిర్వహణకు ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. స్థానిక అధికారులు, నాయకులకు అవగాహన కల్పించి, అత్యవసర సమయాల్లో ప్రజలకు చేసే సేవల్లో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ శాఖ నుండి విపత్తు ఎదుర్కోవడానికి టీములను సిద్ధం చేసి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పోయిన సంవత్సరం ఊహించకుండా వరదలు వచ్చాయని, ఈసారి ముందస్తుగా పటిష్ట కార్యాచరణతో ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పోలీసు కమీషనర్ అన్నారు. సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ, డిఆర్ఎఫ్ టీములను డివిజన్ల వారిగా విభజించి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నాలా/ డ్రైయిన్ల క్లియర్ కు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత వరదల నుండి ఎంతో నేర్చుకున్నట్లు, నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, శిధిలావస్థలో ఉన్న అంగన్వాడీ, ప్రభుత్వ భవనాలను గుర్తించి, ప్రత్యామ్నాయ భవనాల్లోకి ముందస్తుగా మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు, విలువైన సామాగ్రి, రికార్డు పాడవకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అన్నారు. విలువైన అసెట్స్ ను గుర్తించి అవగాహన కల్పించి, వాహనాలకు లాగా భీమా చేయించడానికి చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట ఇన్సూరెన్స్ శిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నీటి వనరుల తనిఖీలు చేపట్టి, వాటి కాల్వలు, కట్టల పటిష్టతను చూడాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు**

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస,క్యాంప్ కార్యాలయంలో సోమవారం రోజున హసన్ పర్తి మండలం,1,2,55,56,65,66 డివిజన్లకు సంబంధించిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 37 మంది లబ్ధిదారులకు 37 లక్షల 3 వేల 712 రూపాయల విలువగల చెక్కులను, 55వ డివిజన్ కు సంబంధించిన 6 లబ్ధిదారులకు 1,74,500 విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను వర్ధన్నపేట ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకంలో భాగంగా నూతన వధూవరులకు ఆర్థిక సాయం అందించాలనేదే ప్రభుత్వ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన సీఎం చెక్కులను తీసుకువచ్చి పంపిణీ చేయడం జరుగుతుందని క్యాంపు కార్యాలయానికి వచ్చి ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చల్ల ప్రసాద్,మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి,మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ కుమార్,వీసం సురేందర్ రెడ్డి,శివరాం.66వ డివిజన్ అధ్యక్షుడు కానీపర్తి కిరణ్,ఎర్రగట్టు గుట్ట చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి గౌడ్, వింజమూరు వెంకటేశ్వర్లు,బల్సుకురి శ్రీనివాస్,బీసీ సెల్ అధ్యక్షుడు కొండమీది సంతోష్,పెద్దమ్మ నరసింహులు,మేకల ఆనంద్,జన్ను రమేష్,తాళ్ల మధు,బిగుళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు కుటుంబాలకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** తల్లాడ మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన పులి కనక దర్గయ్య, అన్నారుగూడెం గ్రామానికి చెందిన బయ్యవరపు దర్గయ్య ఇటీవల చనిపోగా.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి.. చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నేను... అప్పట్లో అథ్లెటిక్స్ నేషనల్స్ ఆడా..

- **ఢిల్లీ స్థాయిలో ఖమ్మంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు కానుండడం సంతోషకరం**
- **ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తాను 1978, 1979 కాలంలో జాతీయ అథ్లెటిక్స్ లో 400 మీటర్ల విభాగంలో ఆడానని, అప్పట్లో రన్నింగ్ ట్రాక్ కోసం సరైన సౌకర్యాలు ఉండేవి కావని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్, షటిల్ కోర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా.. ఎంపీ రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో బొగ్గు, ఇతర పదార్థాలతో ట్రాక్లు ఏర్పాటు చేసేవారని.. ఢిల్లీలో మాత్రమే సింథటిక్ ట్రాక్ ఉండేదని, ఎంతో వింతగా చూసేవారమని గుర్తుచేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రూ. 8.50 కోట్లతో ఏర్పాటు కానుండడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డి ఎస్డీఓ సునీల్ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే నాయకులకు మంచి పదవులు లభిస్తాయి

- **రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**
- **ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి**
- **కాంగ్రెస్ సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరు**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా మంచి పదవులు లభిస్తాయని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్ లో నిర్వహించిన సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. సభా ప్రాంగణం వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సభ ప్రారంభానికి ముందు పహల్గామ్ తీవ్ర వాదుల దాడిలో మృతి చెందిన వారికి మౌనం పాటించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం ఇన్ చార్జ్ నాయిని రాజేందర్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ లతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి ప్రసంగించారు. గ్రామ, మండల స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి పాలన నడుస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. ఆరు గ్యారెంటీల్లో అత్యధికంగా అమలవుతున్నాయని చెప్పారు. నాయకులంతా గ్రామ గ్రామాన ప్రజల చెంతకు మన పథకాలను తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ గత పదేళ్లలో చేసింది ఏమీ లేదని విమర్శించారు.

కార్యక్రమం లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్ చార్జ్ బత్తిని శ్రీనివాస్, కోఆర్డినేటర్ అనిల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్ర శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్యా, బీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కల్లూరు చైర్ పర్సన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి..

**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నేత షేక్ అబ్దుల్ రషీద్..**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** మధ్య భారత దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న నరమేధాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని అఖిలపక్ష పార్టీలు, పౌర సమాజం, ప్రజాస్వామిక హక్కుల సంఘాల నేతల ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్ వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవ హారం, నిరసన చేపట్టారు.. బీజేపీ ప్రభుత్వం అమాయక ఆదివాసీ గిరిజనులను అంతం చేయడానికి ప్రయత్నం చేస్తుందని ఖండించారు, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ సారధ్యంలో ఈ దేశ ప్రజలు అందరూ కలిసికట్టుగా ఉండాలని, జోడో యాత్ర కు శ్రీకారం చుట్టారనీ ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చెయడం జరిగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం...రాహుల్ గాంధీ ఆశయాలను సాధించాలన్న కృతనిశ్చయంతో, రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కులగణన చేపట్టి క్యాబినెట్ ఆమోదం తెలిపి అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందని అన్నారు.. కేంద్ర క్యాబినెట్ జన గణనతో పాటు కులగణన కూడా చేయాలని ఆమోదం తెలిపిన నేపథ్యంలో...ఈ ఘనత ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీజీ కే చెందుతుందని ఆయన అన్నారు.. జరిగినది ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయం అని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతి పౌరుడి కోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్ సాద్, జాకీర్, జాని, డాక్టర్ కరీం, ఫజల్, మొహమ్మద్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానికి తెలంగాణ ప్రజాప్రభుత్వం ఒక దిక్సూచి

**గట్టు రాజు పెద్దమందడి మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్**



**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:** కుల గణనను చేపట్టాలని ఎఐసిసి అగ్రనేత , లోక్ సభ ప్రతిపక్ష నేతశ్రీ రాహుల్ గాంధీ డిమాండ్ చేయడం, అలాగే కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో కుల గణన హామీ ఇవ్వడం అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా కుల గణన చేపట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టనున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తెలిపారు.రాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్ విధానం ద్వారా నిమ్న వర్గాల ప్రజలు జీవితంలో అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కుల గణనకు ఎప్పుడు సానుకూలంగానే ఉంది, శాస్త్రీయమైన కులగణన జరుగుతే వెనుకబడిన వర్గాలకు ఆర్థిక ,సామాజిక లాభాలు అందుతాయని రాహుల్ గాంధీ గారి నమ్మకం . భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని కుల గణన చేపట్టాలని సంకల్పం ఉన్నందుకు రాహుల్ గాంధీ ని అభినవ అంబేద్కర్ గా పేర్కొన్నారు.కుల గణన ద్వారా శాస్త్రీయ పద్ధతిలో అన్ని కులాల వివరాలను సేకరించి విద్య, ఉద్యోగ ,రాజకీయ రంగాలలో వారి సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించాలని ఉద్దేశంతో ప్రతి వర్గానికి సంబంధించిన జనాభా వివరాలు వెలుగులోకి వచ్చి, ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడి ఉన్న వారికి సరైన ప్రాతినిధ్యం లభించనుందని వివరించారు.తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సంకల్పంగా తీసుకున్న కుల గణన అంశం సామాజిక న్యాయ సాధనకు ముఖ్యమైన పాదస్థంభంగా నిలుస్తుందని చెప్పారు.రిజర్వేషన్లు కేవలం ప్రభుత్వ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ రాయితీ పొందే పరిశ్రమల్లో కూడా అమలు చేయాలన్నారు.జిల్లా కలెక్టర్లు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు విద్యా హక్కు చట్టం ప్రకారం సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాల నుండి అధికారంలో ఉంటూ కులగణన ప్రస్తావన ఎత్తలేదు.రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టిన విధానాన్ని చూసి నేడు కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలని ఆలోచనకు వచ్చిందని దానిని కొందరు బిజెపి నాయకులు మోడీ విజయం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి అని అన్నారు.

# తెలంగాణను దేశంలోనే గర్వించదగిన రాష్ట్రంగా చేసిన రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

**పాలాభిషేకం కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, గింజల నర్సిరెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ను అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసి దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇంతవరకు ఏ నాయకుడు తీసుకొనటువంటి చారిత్రాత్మకమైన సంచలమైన నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికైనా బీసీ ఎస్సీ ఎస్టీల పక్షపాతం వహిస్తుందని నిరూపించిన ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, భారత్ జోడో యాత్రలో దేశంలో కులగణన చేపట్టాలని ప్రత్యేక డిమాండ్ చేసిన బావి ప్రధాని రాహుల్ గాంధీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు కామేపల్లి మండలం కొత్త లింగాలలోని మాజీ మంత్రి రాం రెడ్డి వెంకటరెడ్డి విగ్రహం వద్ద రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, పిసిసి



అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు చల్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన పాలాభిషేకంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, రాజకీయాలు పార్టీలకతీతంగా బీసీ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్

చిత్ర పటాలకు పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చే 78 సంవత్సరాలు అయినప్పటికీ బీసీలను ఏ కేంద్ర ప్రభుత్వం గానీ, ఈ రాష్ట్ర ప్రభుత్వం గానీ గుర్తించలేదని, కేవలం తమ ఓటు బ్యాంకుకు మాత్రమే, తమ స్వార్థం కోసం వినియోగించుకున్నారని, కానీ భావి భారత ప్రధాని శ్రీ రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రను కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేపట్టిన కార్యక్రమంలో దేశంలో బీసీల కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని, 60 శాతం పైగా ఉన్న బీసీలకు తక్షణమే న్యాయం చేయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేయడంతో ఈరోజు కేంద్ర ప్రభుత్వం వణికిపోయింది. బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజులలో పుట్టగతులు ఉండవని అంతేకాకుండా మొదటిసారిగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో తెలంగాణ నుంచి అసెంబ్లీ తీర్మానం పార్లమెంటుకు రావడం చర్చనీయాంశమైనది. మన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బీసీలకు న్యాయం చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకొన్నారని మల్లి బాబు యాదవ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బిసి కుల గణన ప్రకటన ను చిత్తశుద్ధితో అమలు చేయాలని మల్లి బాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో , రాంరెడ్డి జగన్నాథ రెడ్డి, మేకపోతుల మహేష్ దమ్మాలపాటి సత్యం, పాటిబండ్ల ప్రసాదు, దేవండ్ల రామకృష్ణ,బాలు బాబు, రాంబాబు కమటం వెంకటేశ్వర్లు శబరినాథ్, జక్కంపూడి వెంకటేశ్వర్లు విట్టా శ్రీను నాగయ్య, రమేష్ సులోచన విశ్వనాథం, బొడ్డు లక్ష్మీనారాయణ బాలశౌరి రమణ, మొగిలి శ్రీను, మరియు తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఆర్థికాభివృద్ధిలో అసమానతలెన్నో

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధి వాపా లేక బలుపా అని బేరీజు వేసుకుని ముందుకుసాగడం ఉత్తమం. ఎందుకంటే ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే భారతదేశ వాస్తవ అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనపడుతున్నది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల' సాధనలో మన దేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహార లోపంలో 111వ స్థానంలో, మహిళా రక్షణ లో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పావర్టీలో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకుకలిగిన ప్రయోజనం ఏమిటి? ఇది మన అందరినీ వెంటాడుతున్న ప్రశ్న. ఈ ప్రశ్నలకు నేటి పాలకులు సమాధానం చెప్పాలి.



నేటికి భారత దేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మన దేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒక్క పూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే, తేటతెల్లం అవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మండుతున్నాయి.

ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తున్నది. ఉద్యోగ ఉపాధి అవకాశాలులేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారినా ఎవరికి లాభం? కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామిక వేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి. కార్పొరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి. దేశానికి అన్నం అందించే అన్నదాతలు ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు కనపడటం లేదు. కేవలం నాలుగు రహదారులు, ఆరు విమానాశ్రయాలు, పది పదంతస్థుల ఆకాశహర్మ్యాలు నిర్మించి, యాభై, డెభై అడుగుల విగ్రహాలు, సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరికం తగ్గుతుందా! ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ద్వారా వాస్తవాలు ఎల్లకాలం దాచలేరు. గతంలో 8%, 9% ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతున్నదని గ్రహించాలి. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడిరది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగానికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఉంది. 'చైనా' వలే స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు ఊబిలో కూరుకు పోకుండా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. కుల, మత, వర్గ, భాష, లింగ వివక్షలు తొలగించడానికి కృషి చేయాలి. అంతేకాని కొందరు బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసిపోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం.




## ముసాయిదా తీర్మానం
# నీరుగారినట్టేనా!

పహల్గాం ఉగ్రఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రపంచ దేశాలకు కనువిప్పు కలిగేలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం పాఠం ఉంటుందని భారత్ ఆశించింది. కానీ తీర్మానం ఎవరికీ ఏమాత్రం నొప్పి కలగని రీతిలో మొక్కుబడి తంతుగా ముగిసింది. '' అంతర్జాతీయ శాంతిభద్రతలకు తీవ్రమైన ప్రమాదం కలిగించే బహు రూపాల్లో, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదం నెలకొంది. ఉగ్రవాద మూకలను, వారిని పెంచి పోషిస్తున్న బాధ్యులను చట్టం ముందుకు తీసుకురావలసిన అవసరం ఉంది'' అని తీర్మానం ప్రకటించింది. ఈ ప్రకటనలతో ఎలాంటి ఫలితం ఉండదన్న సంగతి అందరికీ తెలిసిందే. పహల్గాం దాడికి తామే బాధ్యులమని ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టిఆర్ఎఫ్) మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ టిఆర్ఎఫ్ పేరు తీర్మానంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే టిఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద పిల్ల సంస్థలకు మూలవేరుగా పేర్కొనే లష్కర్ ఇ తొయిబాను ఉగ్రవాద సంస్థగా భద్రతా మండలి ఎప్పుడో గుర్తించింది. పహల్గాం దాడి వెనుక లష్కర్ ఇ తొయిబా ప్రేరణ ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ లష్కర్ ఇ తొయిబా పేరు కానీ, దీంతో సంబంధం ఉన్న గ్రూపుల విషయం కానీ తీర్మానంలో ఎక్కడా పేర్కొనక పోవడం విశేషం. ముస్లిమేతరులను టార్గెట్ చేసుకున్న ఉగ్రవాదుల గురించి కానీ, మతపరమైన ఉద్రిక్తతలను ప్రేరేపించే లక్ష్యం పెట్టుకున్న విద్రోహ చర్య గురించి కానీ, తీర్మానంలో రేఖామాత్రమైనా ప్రస్తావించలేదు. ఉగ్రవాద నిర్మూలన ప్రయత్నంలో గతంలో మాదిరిగా భారత ప్రభుత్వంతో అన్ని దేశాలూ సహకరించాలన్న సూచన కూడా తీర్మానంలో చోటు చేసుకోలేదు. ఇదివరకటి తీర్మానాలతో పోలిస్తే ఇప్పటి తీర్మానం భాష ముసాయిదా పూర్తిగా నీరు కారిపోయినట్టు స్పష్టమవుతోంది. రాజీ పూర్వకంగా అందరికీ ఆమోదయోగ్యమైన భాషను ఉపయోగించినట్టు తెలుస్తోంది. దీని వెనుక పాకిస్థాన్, చైనా దేశాల ప్రభావం ఉన్నట్టు చెప్పవచ్చు. భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశంగా ఈ ఏడాదే పాకిస్థాన్ ఎన్నికైంది. పాకిస్థాన్‌కు సర్వకాల మిత్రదేశం చైనా. పాకిస్థాన్‌ను ఇరకాటంలో పెట్టే సంక్లిష్టమైన తీర్మానాలను తీసుకురాకుండా చూడడంలో చైనా హస్తం ఉంది. గతంలో కూడా అనేకసార్లు పాకిస్థాన్ పక్షాన చైనా నిలిచిన ఉదంతాలు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడిపై తమపై వచ్చిన ఆరోపణలపై ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ ఎంతో ప్రయత్నిస్తోంది. దానికి చైనా, అమెరికా సాయం కోరుతోంది. ఈ సందర్భంలో పహల్గాం దాడిపై నిష్పాక్షిక దర్యాప్తును వేగవంతం చేయాలని పాకిస్థాన్ డిమాండ్ చేస్తోంది. దానికి చైనా వంత పాడుతోంది. అమెరికా, రష్యా, బ్రిటన్ దేశాలైనా సరే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏ తీర్మానం తీసుకువచ్చినా ఆమోదం లోకి తీసుకురావద్దని ప్రస్తుత భద్రతా మండలి అధ్యక్షుడు , ఫ్రాన్స్ దౌత్యవేత్తకు పరోక్షంగా చైనా సంకేతాలందిస్తోంది.

ఫలితంగా భద్రతా మండలి తీర్మానం పసలేక మెత్తగా వెలువడిరది. తీర్మానంలో టిఆర్ఎఫ్ పేరు లేకుండా చేయడంలో అమెరికాతో కలిసి చైనా లాబీ చేయడంలో కృతకృత్యురాలైంది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని టీఆర్ఎఫ్‌ను తప్పించింది. దీంతో టీఆర్ఎఫ్ తన ఇదివరకటి ప్రకటనను ఉపసంహరించుకుంది. టీఆర్ఎఫ్ పేరును తొలగించి భద్రతా మండలి తుది తీర్మానం ఖరారు చేసిన తరువాత పాకిస్థాన్ విధానపరమైన వైఖరికి అనుకూలంగా తనకు తాను మలచుకుంది. పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని , భద్రతను చైనా సమర్థిస్తుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఇూ ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. పాకిస్థాన్‌లో వివిధ ప్రాజెక్టుల్లో కొన్ని వేల మంది చైనా జాతీయులు పనిచేస్తున్నారు. మిత్రదేశమైన పాకిస్థాన్‌ను ఉగ్రవాద విషయంలో తూర్పారపట్టితే పాక్‌తో వైరం కొని తెచ్చుకోవలసి వస్తుందని, పాక్ లోని చైనా జాతీయులకు రక్షణ లేకుండా పోతుందని చైనా ముందు చూపుతో వ్యవహరిస్తోంది. భద్రతా మండలి వ్యవహారం భారత్‌కు అసంతృప్తి కలిగిస్తోంది. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ అత్యంత కఠినమైన పదజాలంతో తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలన్న ఆలోచనలో భారత్ ఉంది. పాకిస్థాన్ స్థావరంగా ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఇ మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహార్ నిర్వాకాన్ని పుల్వామా దాడి తరువాత భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. పహల్గాం దాడికి బాధ్యులైన టిఆర్ఎఫ్ వంటి ఉగ్రసంస్థలను ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రపంచ దేశాలకు నిరూపించాలన్న పట్టుదలతో భారత్ ఉంది. 2008 లోముంబై, 2019 లో పఠాన్‌కోట్, 2019లో పుల్వామా ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో అలాంటి ఉగ్రదాడులకు వీలు కల్పించకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని పాకిస్థాన్ గతంలో అనేక సార్లు భారత్‌కు ద్వైపాక్షిక చర్చల్లో హామీలు ఇచ్చింది. కానీ ఏవీ నెరవేర్చలేకపోయింది. భారత్‌తో దౌత్యపరమైన సంబంధాలు కూడా సరిగ్గా సాగించడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై వేటు వేయాలన్నది భారత్ ప్రధాన లక్ష్యం. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ నిధులు అందిస్తోందన్న కారణం చూపించి ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ ముందు పాక్‌ను నిలబెట్టాలని భారత్ సిద్ధమవుతోంది. 2012 నుంచి 2015,2018 నుంచి 2022 సమయాల్లో పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు ఉంచిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వేదిక సాక్షిగా ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ ప్రయత్నాలు చేయాలని భారత్ యోచిస్తోంది. ముంబై ఉగ్రదాడుల్లో కీలక పాత్ర వహించిన ఉగ్రవాది తహవూర్ రాణాను అమెరికా నుంచి బహిష్కరింప చేసి ఏ విధంగా భారత్ తన చట్టం ముందుకు తీసుకు రాగలిగిందో అదే విధంగా పహల్గాం ఉగ్రదాడి ముష్కరులను న్యాయస్థానం ముందు నిలబెట్టగలిగితేనే పహల్గాం దాడిలో అమరులైన వారికి ఆత్మశాంతి లభిస్తుంది.

## పాక్ గగనతలం మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఎంత నష్టమో తెలుసా?

ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారతదేశం పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత ప్రభావం ఇప్పుడు భారత కంపెనీలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ షేర్లు పతనం గురించి చర్చ జరిగింది. ఇప్పుడు రతన్ టాటాకు ఇష్టమైన కంపెనీలలో ఒకటైన ఎయిర్ ఇండియా గురించి కూడా చర్చ జరుగుతోంది. భారత విమానయాన సంస్థలకు పాకిస్తాన్ గగనతలం ఒక సంవత్సరం పాటు మూసివేస్తే ఎయిర్ ఇండియాకు ఏటా రూ. 50,000 కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ వాదన రాయిటర్స్ నివేదికలో చేయబడిరది. ఎయిర్ ఇండియా భారత ప్రభుత్వానికి ఒక లేఖ రాసి ఈ నష్టాన్ని ప్రస్తావించిందని రాయిటర్స్ పేర్కొంది. ఈ లేఖను తాను చూశానని, చదివానని రాయిటర్స్ పేర్కొంది. పాకిస్తాన్ గగనతలంపై నిషేధం ఒక సంవత్సరం పాటు కొనసాగితే ఎయిర్ ఇండియా దాదాపు ৳600 మిలియన్ల (50,400 కోట్లు)పైగా అదనపు ఖర్చులను ఎదుర్కోవాల్సి ఉంటుందని రాయిటర్స్ నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ నష్టాన్ని భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. గత వారం కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి ప్రతీకారంగా సింధు జల ఒప్పందాన్ని భారతదేశం నిలిపివేసిన తరువాత పాకిస్తాన్ తన వైమానిక ప్రాంతాన్ని ఆ దేశ విమానయాన సంస్థలకు మూసివేసింది. ఆ తరువాత భారతీయ విమానయాన సంస్థలు అధిక ఇంధన ఖర్చులు, సుదీర్ఘ ప్రయాణాలను ఎదుర్కోవలసి ఉంటుంది. దీని కారణంగా కంపెనీలు నిర్వహణ ఖర్చులను ఎదుర్కోవలసి రావచ్చు. ఏప్రిల్ 27న



ఎయిర్ ఇండియా ఆర్థిక నష్టం గురించి భారత ప్రభుత్వానికి తెలియజేసింది. ఈ నిషేధం కారణంగా విమానయాన సంస్థకు ఏడాదికి రూ. 50 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు పంపిన లేఖలో ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రభావిత అంతర్జాతీయ విమానాలకు సబ్సిడీ మంచి ఎంపిక కావచ్చని లేఖలో పేర్కొన్నారు. పరిస్థితి మెరుగుపడితే సబ్సిడీని తొలగించవచ్చు. ''విమానాశ్రయాల మూసివేతలు, అదనపు ఇంధన వినియోగం, అదనపు సిబ్బంది కారణంగా ఎయిర్ ఇండియా ఎక్కువగా ప్రభావితమవుతుంది. జు నివేదిక ప్రకారం.. ఎయిర్ ఇండియా ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. వ్యాఖ్య కోసం చేసిన అభ్యర్థనకు భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. భారత విమానయాన సంస్థలపై గగనతల నిషేధం ప్రభావాన్ని అంచనా వేయమని ప్రభుత్వం తన అధికారులను కోరిన తర్వాత ఎయిర్ ఇండియా లేఖ పంపినట్లు ఈ విషయంపై ప్రత్యక్ష అవగాహన ఉన్న ఒక మూలం తెలిపింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఈ విమానయాన సంస్థ ప్రభుత్వ యాజమాన్యంలో కొంతకాలం కొనసాగిన తర్వాత ఎక్కువ బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జిస్తోంది. బోయింగ్, ఎయిర్‌బస్‌ల నుండి జెట్ డెలివరీలలో జాప్యం కారణంగా అభివృద్ధి ఇప్పటికే దెబ్బతింది.

## భారత్‌లో హ్యుందాయ్ సరికొత్త రికార్డు..

భారత మార్కెట్‌లోకి ప్రవేశించిన తర్వాత కంపెనీ ఇప్పటి వరకు 90 లక్షల వాహనాలను విక్రయించింది. ఈ విక్రయాల గణాంకాలు దేశంలో హ్యుందాయ్ కార్లు ఎంతగా ఇష్టపడబడుతున్నాయో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ భారతదేశంలో ఒక పెద్ద మైలురాయిని సాధించింది. కంపెనీ ఇప్పటివరకు భారతీయ మార్కెట్‌లో 90 లక్షల వాహనాలను విక్రయించింది. ఏప్రిల్ 2025లో కంపెనీ మొత్తం 60,774 వాహనాలను విక్రయించింది, వీటిలో 44,374 భారతదేశంలో, 16,400 విదేశాలలో విక్రయించబడ్డాయి. కంపెనీ త్వరలో మహారాష్ట్రలోని తలేగాంవ్‌లో కొత్త ప్లాంట్‌ను ప్రారంభించనుంది. దీనితో ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుంది. భారతదేశంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఒక పెద్ద సాఫల్యాన్ని సాధించింది. భారత మార్కెట్‌లోకి ప్రవేశించిన తర్వాత కంపెనీ ఇప్పటివరకు 90 లక్షల వాహనాలను విక్రయించింది. ఈ విక్రయాల గణాంకాలు దేశంలో హ్యుందాయ్ కార్లు ఎంతగా ఇష్టపడబడుతున్నాయో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. కంపెనీ నిరంతరం తన అద్భుతమైన కార్లతో కస్టమర్లను ఆకర్షించడంలో విజయవంతమవుతోంది. గత నెల (ఏప్రిల్ 2025) విక్రయాల నివేదిక ప్రకారం.. హ్యుందాయ్ మొత్తం 60,774 వాహనాలను విక్రయించింది. వీటిలో 44,374 యూనిట్లు దేశీయ మార్కెట్‌లో, 16,400 యూనిట్లు ఎగుమతి చేయబడ్డాయి. హ్యుందాయ్ భారతదేశంలో మే 6, 2025న 30 సంవత్సరాల సందర్భాన్ని జరుపుకోనుంది. ఈ కాలంలో కంపెనీ మారుతి సుజుకీ తర్వాత రెండవ అతిపెద్ద కార్ కంపెనీగా గుర్తింపు పొందింది. నిరంతరం మెరుగైన ఉత్పత్తులను అందించడం, కస్టమర్ల హృదయాల్లో నమ్మకాన్ని హ్యుందాయ్ సాధించింది. ఈ సందర్భంగా



హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ.. మే 6, 2025న కంపెనీ భారతదేశంలో 30 సంవత్సరాలు పూర్తి చేసుకోనుందని తెలిపారు. భారతీయ మార్కెట్‌లో ఇప్పటివరకు 90 లక్షల వాహనాలను విక్రయించిన లక్ష్యాన్ని సాధించినందుకు తాము సంతోషిస్తున్నామని, ఇది నిజంగా ఒక పెద్ద విజయమని చెప్పారు. కంపెనీ త్వరలో మహారాష్ట్రలోని తలేగాంవ్‌లో కొత్త ప్లాంట్‌ను ప్రారంభించనుందని, దీనితో కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. హ్యుందాయ్ భారతదేశం కోసం వివిధ రకాల కార్లను తయారు చేస్తుంది. కంపెనీ చిన్న కార్ల నుండి ప్రీమియం సెగ్మెంట్ కార్ల వరకు దృష్టి సారిస్తుంది. ప్రస్తుతం హ్యుందాయ్ వద్ద హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో గ్రాండ్ ఐ10 నియోస్, ఐ20, ఐ20 ఎన్ లైన్ వంటి కార్లు ఉన్నాయి. అంతేకాకుండా సెడాన్ కార్లలో ఆరా, వెర్నా కూడా అందుబాటులో ఉన్నాయి. కాంపాక్ట్ ూఖప సెగ్మెంట్‌లో ఎక్స్‌టర్, వెన్యూ, క్రెటా వంటి కార్లు ఉన్నాయి. అదే సమయంలో ఫ్యామిలీ క్లాస్ కోసం ఆల్కజార్ వంటి కారు కూడా అందుబాటులో ఉంది. భారతదేశంలో హ్యుందాయ్ క్రెటా ూఖప అత్యధికంగా విక్రయమవుతోంది. ఇటీవల ఐ10 బ్రాండ్ 30 లక్షల యూనిట్ల విక్రయ రికార్డును సృష్టించింది. త్వరలో భారతదేశంలో కొన్ని కొత్త మోడళ్లను పరిచయం చేసేందుకు కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# కొత్త పుంతలు తొక్కుతున్న అబద్ధాలు

నీ స్నేహితులను చూస్తే నువ్వెలాంటి వాడివో తెలుస్తుందన్నది ఒక లోకోక్తి. అనేక దేశాల నేతలు డోనాల్డ్ ట్రంప్ తమ జిగినీ దోస్తు అని చెప్పుకోవటం, చెట్టపట్టాల్ వేసుకొని తిరగటం తెలిసిందే. ట్రంప్ దాదాపు ప్రతి రోజూ ఎక్కడో అక్కడ మీడియాతో మాట్లాడితే, నోరు విప్పేది లేదని మోడీ భీషణ ప్రతిజ్ఞ చేసినట్టు వ్యవహరిస్తారు! ట్రంప్ పచ్చి అబద్ధాల కోరు అని చైనా తాజాగా చెబుతోంది, ఒక్క చైనాయే కాదు, అమెరికా మీడియా సైతం గతంలోనూ ఇప్పుడూ అదే చెబుతోంది. రోజూ ఎన్ని అసత్యాలు, తప్పుడు సమాచారం చెబుతున్నదీ లెక్కలు తీయటం ఒక పనిగా మారింది. తాజా అబద్ధం ఏమిటంటే చైనా అధ్యక్షుడు తనతో మాట్లాడినట్లు ట్రంప్ చెప్పాడు. ఎప్పుడు అంటే అవన్నీ మీకెందుకు మూడు నాలుగు వారాల్లో పన్నుల మీద అమెరికా ఒప్పందం చేసుకుంటుంది అన్నాడు. పన్నుల నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు చైనా సంకేతం పంపింది, పూర్తి విజయం నాదే అని కూడా చెప్పుకున్నాడు. పన్నుల గురించి అమెరికాతో ఎలాంటి సంప్రదింపులు, చర్చలు జరగటం లేదని చైనా విదేశాంగ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు స్పష్టం చేశాయి. అమెరికా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించాయి. ఇక ట్రంప్ అసత్యాలు, వక్రీకరణల విషయానికి వస్తే రెండోసారి పదవీ స్వీకారం చేసిన రోజే 20 అబద్ధాలు చెప్పినట్లు మీడియా విశ్లేషించింది. తొలి నాలుగేళ్ల పదవీ కాలంలో 30,573 అబద్ధాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక వెల్లడిరచింది. తొలి వంద రోజుల్లోనే 492 అబద్ధాలు, 2020లో ఓటింగ్‌కు ముందు నవంబరు రెండవ తేదీన ఒక్క రోజే 503 అవాస్తవాలు చెప్పి ఓటర్లను ఆకట్టుకొనేందుకు చూసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. నిజంగా ఒక రాజకీయ నేత అలా మాట్లాడతారా అన్న అనుమానం ఉంటే ట్రంప్, అతగాడి స్నేహితులను చూడాల్సిందే.

ట్రంప్ నోటి నుంచి సగటున రోజుకు 21 తప్పుడు సమాచారం లేదా అబద్ధాలు వెలువడినట్లు తేలింది. తొలి ఏడాదిలో రోజుకు సగటున ఆరు, రెండో ఏడాది 14, మూడో ఏడు 22, నాలుగో సంవత్సరం 39 చొప్పున, అంటే పదవీ కాలం ముగిసే వ్యవధి దగ్గర పడిన కొద్దీ అబద్ధాలు పెరిగాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం సంస్థ ఏకంగా ట్రంప్ అబద్ధాల సమాచార కేంద్రాన్నే ఏర్పాటు చేసింది. రెండోసారి తొలి రోజే రెండు ప్రసంగాలలో 20 అబద్ధాలతో ప్రారంభం అయిన తీరు చూస్తే నాలుగేళ్లలో గత రికార్డును బద్దలు కొట్టేందుకు ఎంతో కాలం పట్టదనిపిస్తోంది. ఒక ప్రధానిగా నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎవరికైనా అభినందనలు తెలపటం ఒక సంప్రదాయం, కానీ అబద్ధాల కోరు ట్రంప్‌ను నా స్నేహితుడు అంటూ మోడీ సందేశాలు పంపారు. వివిధ సందర్భాలలో వర్ణించారు కూడా. రాజకీయాల పుట్టుకతోనే అబద్ధాలు కూడా వెంట వచ్చాయిగానీ ఇటీవలి కాలంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎవరు అవునన్నా కాదన్నా వాటికి డోనాల్డ్ ట్రంప్, అతగాడి బాటలో నడిచే వారు నిష్ణాతులుగా మారారు. అతగాడిని చూసి ఉత్తేజం, ఉత్సాహం పొంది ప్రపంచంలో అనేక దేశాల అధ్యక్షులు లేదా ప్రధానులు కూడా సిగ్గూ ఎగ్గూ లేకుండా



అవాస్తవాలు, అసత్యాలు, వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ నాయకుడంటే ఒపీనియన్స్ (అభిప్రాయాలు) మారుస్తూ ఉండాలని గురజాడ చురక అంటించారు. ఆయనే ఇప్పుడు బతికి ఉంటే అబద్ధాలు చెప్పని వాడు రాజకీయ నేత కానే కాదని గిరీశం చేత చెప్పించి ఉండేవారు. జర్నలిస్టులు వార్తలను సేకరించే పనిలో భాగంగా నేతల మాటల్లో అబద్ధాలు ఎన్ని ఉన్నాయో ఎత్తి చూపే పని భారం వారి మీద పడిరదంటే అతిశయోక్తి కాదు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో కొన్ని సంస్థలు ప్రత్యేకంగా సిబ్బందినే నియమించాయి. ట్రంప్ రెండవసారి జనవరి 20న పదవిని చేపట్టి వందవ రోజు పూర్తి చేసుకొనేందుకు ముందుకు పోతున్నాడు. ఈ లోగానే మీడియాను అణచివేసేందుకు కూడా పూనుకున్నాడు. సరిహద్దులు లేని రిపోర్టర్లు అనే సంస్థ పత్రికా స్వేచ్ఛ మీద రాజ్యాంగేతర దాడి ఎలా జరుగుతున్నదో వివరించింది. ఆరోగ్యం, నేరాల వంటి సమాచారం తెలుసుకొనేందుకు వీలు కల్పించే ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్ల నుంచి ఎనిమిదివేల పేజీలను ప్రభుత్వం తొలగించింది. జనాలు, మీడియాకు సమాచారం అందకుండా చేయటం తప్ప ఇది మరొకటి కాదు. ప్రభుత్వం నిర్వహించే 180 రేడియో స్టేషన్లను మూసివేసేందుకు గాను వాటికి అందచేస్తున్న 110 కోట్ల డాలర్ల నిధులు నిలిపివేయాలని పార్లమెంట్‌ను కోరాడు. దీనివలన గ్రామీణ, సుదూర ప్రాంతాల వారికి వాటి సేవలు నిలిచిపోతాయి. ప్రభుత్వ రంగంలోని మీడియాకు ప్రతి ఏటా సగటున ఒక పౌరుడు చెల్లిస్తున్న మొత్తం కేవలం 1.6 డాలర్లు మాత్రమే. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి అధ్యక్ష భవన వార్తలను సేకరించకుండా అసోసియేటెడ్ ప్రెస్(ఏపి) సంస్థ విలేకర్లను నిషేధించారు. మెక్సికో గల్ఫ్ పేరును అమెరికా గల్ఫ్ అని మార్చినప్పటికీ ఆ సంస్థ తన వార్తల్లో పాత పేరునే వినియోగిస్తుండటమే దీనికి కారణం. ఏప్రిల్ 9న ఒక కోర్టు ఈ నిషేధం ఎత్తివేయాలని ఆదేశించినప్పటికీ ఖాతరు చేయటం లేదు. తన స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా 64 సార్లు మీడియా మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడు. 2021 జనవరి ఆరున కాపిటోల్ వద్ద జర్నలిస్టులపై దాడి చేసిన కేసులో శిక్షలు పడిన తన అనుచరులైన 13 మంది గూండాలను క్షమాభిక్ష పేరుతో విడుదల చేశాడు. మీడియా సంస్థలను వేధించేందుకు ఆరు కంపెనీలపై విచారణకు ఆదేశించాడు. ప్రాజెక్టు 2025 పేరుతో ట్రంప్ ఎజెండాకు రూపకల్పన చేసిన బ్రెండన్ కార్, మీడియా నియంత్రణ కమిషన్ చైర్మన్‌ను చేసిన తరువాత ట్రంప్ గురించి విమర్శనాత్మక వార్తలను అందించే సిబిఎస్, ఎబిసి, ఎన్‌బిసి, ఎన్‌పిఆర్, పిబిఎస్, కాలిఫోర్నియా టెలివిజన్‌లపై విచారణ పేరుతో వేధింపులకు పూనుకున్నాడు. నాలుగు సంస్థలపై ట్రంప్ వ్యక్తిగతంగా పరువునష్టం కేసులు వేశాడు. ఇక కమ్యూనిజానికి, తమను వ్యతిరేకించే దేశాల గురించి తప్పుడు ప్రచారం చేసేందుకు అమెరికా ప్రభుత్వం యుఎస్ ఏజన్సీ ఫర్ గ్లోబల్ మీడియా అనే సంస్థను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. తరువాత మీడియా పెద్ద ఎత్తున విస్తరించి అలాంటి ప్రచారం చేసేందుకు వాటితో పెద్దగా అవసరం లేకపోయింది. అందుకే అది నిర్వహించే రేడియో, టీవీ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. విలేకర్లను సెలవుపై వెళ్లాలని కోరారు. ఈ సంస్థ ద్వారా నిర్వహించే వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, యూరోప్ లిబర్టీ వంటి వాటిలో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య వ్యతిరేక వార్తలను ప్రచారం చేస్తున్నారు. అవి ఎంతగా రెచ్చగొట్టినా అమెరికా పాలక వర్గానికి వచ్చిన మేలేమీ లేకపోవటంతో ట్రంప్ వాటికి నిధులు నిలిపివేశాడు. ఈ చర్య వలన మూడున్నర వేల మందికి పైగా జర్నలిస్టులు, ఇతర సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. ఈ సంస్థలలో పని చేస్తూ తప్పుడు వార్తలను ప్రచారం చేసిన జర్నలిస్టులలో విదేశాలకు చెందిన 84 మందిని స్వదేశాలకు పంపాలని నిర్ణయించింది. అయితే వారిలో అనేక మందిని ఆయా దేశాలు కేసులు పెట్టి జైలు పాలు చేసే అవకాశం ఉందట. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసేందుకు వివిధ దేశాలలో ప్రైవేటు టీవీలు, పత్రికలకు, కొందరు జర్నలిస్టులకు సిఐఏ, ఇతర సంస్థల ద్వారా పెద్ద ఎత్తున నిధులు అందచేస్తున్న సంగతి తెలిసిందే.

# షారుఖ్ సూపర్ ఐడియా



జనాలు థియేటర్లకు రావడాన్ని తగ్గించడం వెనుక కారణం క్వాలిటీ కంటెంట్ లేకపోవడమే కావొచ్చు కానీ అంతకన్నా సీరియస్ గా చూడాల్సిన సమస్య మరొకటి ఉంది. అదే టికెట్ రేట్లు, స్నాక్స్ ధరలు. గత కొన్నేళ్లుగా థియేటర్ ఎక్స్ పీరియన్స్ చాలా ఖరీదుగా మారిపోయింది. ముఖ్యంగా మల్టీప్లెక్సులు వచ్చాక వీటి వ్యయం తట్టుకోలేక మధ్య తరగతి జనాలు ఓటిటి, పైరసీకి అలవాటు పడ్డారు. ఇది బాలీవుడ్ వ్యాపారాన్ని తీవ్రంగా పట్టి పీడిస్తోంది. అందుకే అప్పుడప్పుడు 99 రూపాయల టికెట్లు, వన్ ప్లస్ వన్ ఆఫర్లు ఇస్తూ ఉంటారు. అయినా సరే పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు. దీనికి షారుఖ్ ఖాన్ ఒక సూపర్ ఐడియా ఇచ్చాడు. తాజాగా జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ 2025లో అతిథిగా పాల్గొన్న షారుఖ్ ఖాన్ ఒక ప్రతిపాదన తెచ్చాడు. ప్రతి ఊరిలో చీప్ థియేటర్లు ఉండాలని, వాటిలో భాషతో సంబంధం లేకుండా భారతీయ చిత్రాలు ప్రదర్శించాలని, టికెట్ రేట్లు అందుబాటులో ఉండేలా చూసుకుంటే ఫుట్ ఫాల్స్ పెరుగుతాయని వివరించాడు. షారుఖ్ అన్నదాంట్లో లాజిక్ ఉంది. సగటున 200 నుంచి 500 రూపాయల మధ్యలో మల్టీప్లెక్స్ టికెట్ రేట్లు ఉంటున్నాయి. పుష్ప, ఆర్ఆర్ఆర్, కల్కి లాంటి ప్యాన్ ఇండియా మూవీస్ అయితే ఓకే కానీ మార్కెట్ తక్కువగా ఉండే కొందరు టయర్ 2 హీరోలకు సైతం ఈ పద్ధతినే ఫాలో అవుతున్నారు నిర్మాతలు. దీని వల్ల కామన్ మ్యాన్ దూరమైపోయాడు. ఒకవేళ షారుఖ్ అన్నట్టు వంద లోపే టికెట్లు అమ్మేలా సాధారణ వసతులు ఉన్న సింగల్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తే హిట్టు ఫ్లాపుతో సంబంధం లేకుండా ఎక్కువ జనాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఐడియా అయితే చెప్పాడు.



# మావయ్య నాకు స్ఫూర్తి

ఏ ముహూర్తంలో మొదలయ్యిందో కానీ మెగా ఫ్యాన్స్, అల్లు అభిమానుల మధ్య తరచు ఆన్ లైన్ గొడవలు జరగడం చూస్తూనే ఉన్నాం. డిజె ఈవెంట్లో చెప్పను బ్రదర్ తో మొదలైన ఈ రచ్చ పుష్ప 2ని టార్గెట్ చేసుకునే దాకా వచ్చింది. గత కొన్నేళ్లుగా ఉద్దేశపూర్వకంగానే బన్నీ ఎక్కడా చిరంజీవి ప్రస్తావన తేవడం లేదని, తనకు ఎవరి మద్దతు అవసరం లేదనే తరహాలో ప్రవర్తిస్తున్నాడని మెగా ఫ్యాన్స్ చేసే కామెంట్. అలాంటిదేమి లేదు, సందర్భం వచ్చినప్పుడు మావయ్య మీద ప్రేమను ఐకాన్ స్టార్ ప్రదర్శిస్తూనే ఉంటాడని ఇటువైపు నుంచి వచ్చే కౌంటర్. తాజాగా జరిగిన వేవ్స్ సమ్మిట్ 2025లో దీనికి చెక్ పెట్టే ప్రయత్నం చేశాడు బన్నీ. స్టేజి మీద ఉన్న యాంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనకు గొప్ప స్ఫూర్తి ఇచ్చిన వాళ్లలో మావయ్య మెగాస్టార్ చిరంజీవి ఒకరని, ఆయన ప్రభావం నామీద చాలా బలంగా పని చేసిందని చెప్పుకొచ్చాడు. ఈ మాటలు చెబుతున్నప్పుడు సభికుల నుంచి చప్పట్లు వినిపించడం విశేషం. ఇప్పుడీ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. పుష్ప 2కి సంబంధించి సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగినప్పుడు బన్నీ స్వయంగా చిరంజీవి ఇంటికి వెళ్లి జరిగిందంతా వివరించి ఫోటో కూడా తీసుకొచ్చాడు. తర్వాత మళ్ళీ ఈ కలయిక జరగలేదు. ఇప్పుడు వేవ్స్ లో అల్లు అర్జున్ తానుగా చిరు గురించి గొప్పగా చెప్పడం గమనించాల్సిన విషయం. దీన్ని బట్టి అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే హీరోలు బంధుత్వం ఉన్నా లేకపోయినా అందరూ ఒకటే. పైకి ఫ్యాన్స్ ఏదో విభేదాల పేరుతో ఆన్ లైన్ వార్స్ చేసుకుంటారు కానీ అలాంటివి స్టార్ల మధ్య ఉండవు. మెగా అల్లు కుటుంబాలు కలిసి ఎన్నో పండగలు చేసుకున్నాయి.

# థియేటర్లు నిండుతున్నాయి

సరైన సినిమా రాక ప్రేక్షకులు థియేటర్లకు దూరమై గత నెల రోజులుగా డిస్ట్రిబ్యూషన్ వర్గం చూస్తున్న నరకం అంతా ఇంతా కాదు. కొన్ని చోట్ల సింగల్ స్క్రీన్లు మూసేసే పరిస్థితి. కనీసం జీతాలు ఇచ్చేంత కలెక్షన్ రాకపోతే వాటి యాజమాన్యం అంతకన్నా ఏం చేస్తుంది. కానీ హిట్ 3 ది థర్డ్ కేస్ వాతావరణాన్ని మార్చేసింది. రెండు మూడు రోజుల ముందు నుంచే అడ్వాన్స్ బుకింగ్స్ లో భారీ ఫిగర్లు నమోదు చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ఉదయం ఆట నుంచే పాజిటివ్ టాక్ రావడంతో బయ్యర్లు ఊపిరి పీల్చుకుంటున్నారు. చాలా చోట్ల షోలు ఫుల్ అయిపోయి అదనంగా జోడిరచాల్సిన అవసరంలో ఏ మాత్రం అవకాశం ఉన్నా సర్దుబాటు చేస్తున్నారు,. ఇవాళ నిర్వహించిన చిన్న ప్రెస్ మీట్ లో దిల్ రాజు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ప్రేక్షకులు వస్తారా రారా అని టెన్షన్ పడుతున్న టైంలో హిట్ 3 ఆక్సీజెన్ అయ్యిందని, బ్లాక్ బస్టర్ టాక్ తో అంతకంతా పెరుగుతూ పోతోందని నానితో సంతోషాన్ని పంచుకున్నారు. నాని మాట్లాడుతూ నా జడ్జ్ మెంట్ మరోసారి నిజమని రుజువు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పాడు. పోటీ అవుతుందనుకున్న రెట్రోకి తెలుగులో ఆశాజనకమైన టాక్ లేదు. డీసెంట్ ఆక్యుపెన్సీలు కనిపించాయి కానీ అవి వీకెండ్ వరకు ఎంత శాతం స్థిరంగా ఉంటాయనేది చెప్పలేం. హిట్ 3 ఓవర్ ఫ్లోస్ పలుచోట్ల రెట్రోకు ఉపయోగపడుతున్న వైనం సుస్పష్టం. మొత్తానికి హిట్ 3కి వచ్చిన రెస్పాన్స్ కి అందరూ హ్యాపీనే. కాకపోతే దీన్ని ఇలాగే నిలబెట్టుకుంటూ రెండో వారం కూడా కొనసాగించాలి. ఏపీలో టికెట్ రేట్లు పెంచిన ప్రభావం ఏమంత నెగటివ్ కాలేదు. ఇచ్చిన రేటుకి న్యాయం జరిగిందని ఆడియన్స్ ఫీలవుతున్నారు.





# మే వచ్చినా మౌనంలోనే వీరమల్లు

మే నెల వచ్చేసింది. ఇంతకు ముందు చెప్పిన ప్రకారం తొమ్మిదో తేదీ రావాల్సిన హరిహర వీరమల్లు నిర్మాణ సంస్థ చెప్పకుండానే తనంతట తానే వాయిదా పడిపోయింది. దాని స్థానంలో సింగిల్, శుభం వస్తున్నాయి. సరే పోనీ రెండు మూడు వారాలు ఆలస్యంగా అయినా వస్తుందా అంటే ఆ సూచనలూ కనిపించకపోవడం ఫాన్స్ లో ఆందోళన రేపుతోంది. పవన్ కళ్యాణ్ ఇవ్వాల్సిన నాలుగైదు రోజుల డేట్లకు ఏదో ఒక అడ్డంకులు వస్తూనే ఉన్నాయి. రాజకీయ కార్యకలాపాల్లో బిజీగా ఉన్న పవన్ షూటింగ్ కు సరిపడా కాల్ షీట్స్ ఇవ్వలేకపోవడం రిలీజ్ డేట్ నిర్ణయం మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ లెక్కన మేలో లేదంటే నెక్స్ట్ ఆప్షన్ జూనే. అదైనా పక్కాగా ఫిక్స్ చేసుకుని ఎలాంటి పోస్ట్ పోన్లు లేకుండా విడుదల తేదీ ప్రకటిస్తే అభిమానులు రిలాక్స్ అవుతారు. అసలే ఇంత పెద్ద ప్యాన్ ఇండియా మూవీకి బజ్ లేకపోవడం కొనాలని చూస్తున్న బయ్యర్ల మదిలో సవాలక్ష అనుమానాలు రేపుతోంది. పోనీ ఏదైనా ట్రైలర్ లాంటి ప్రమోషన్ కంటెంట్ తో వాటికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారా అంటే అదీ లేదు. దర్శకుడు జ్యోతి కృష్ణ పోస్ట్ ప్రొడక్షన్ లో బిజీగా ఉన్నాడు. నిర్మాత ఏఎం రత్నం అసలు బయట కనిపించడమే మానేశారు. పోనీ కీరవాణిని ఏమైనా అడుగుదామా అంటే దర్శనం అపురూపమైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో హరిహర వీరమల్లుని త్వరగా తీసుకురావడం ఎలాగో అంతు చిక్కడం లేదు. జూన్ 20, 27 తేదీల్లో కుబేర, కన్నప్ప లాంటి ప్యాన్ ఇండియా సినిమాలున్నాయి. వాటిని డిస్టర్బ్ చేయడం న్యాయం కాదు. సో మొదటి రెండు వారాల్లో రావడం మంచి నిర్ణయం అవుతుంది. లేదూ జూలైకు వెళ్లే ఆప్షన్ కూడా చూడొచ్చు.



# ‘శుభం’కు అగ్రసంస్థల చేయూత

సమంత నిర్మాతగా మారి శుభం అనే చిన్న సినిమా తీసింది. మే 9 రిలీజ్. అందరూ కొత్తోళ్లే. దర్శకుడు ప్రవీణ్ ఇంతకు ముందు నెట్ ఫ్లిక్స్ కోసం సినిమా బండి తీస్తే మంచి పేరు తీసుకొచ్చింది. శుభం ట్రైలర్ చూశాక జనం కాసింత నవ్వుకున్నారు కానీ ఖచ్చితంగా థియేటర్లకు వెళ్లాలనే రేంజ్ లో ఆసక్తి పెంచలేకపోయిన మాట వాస్తవం. ముందు సస్పెన్స్ గా పెడదామనుకున్న సమంత క్యామియోని ఇందులోనే రివీల్ చేశారు. కారణం బిజినెస్ యాంగిల్. ఎంత సామ్ ప్రొడ్యూసర్ అయినా కేవలం కొత్త మొహాల మీద బిజినెస్ జరగడం కష్టం. అందులోనూ హిట్ 3 వచ్చిన ఎనిమిది రోజులకు థియేటర్లకు రావడమంటే రిస్క్ ఉంటుంది. సరే బజ్ సంగతి ఎలా ఉన్నా శుభం కోసం అగ్ర డిస్ట్రిబ్యూషన్ సంస్థలు తలో చేయి వేస్తున్నాయి. నైజాం పంపిణి బాధ్యతను మైత్రి తీసుకోగా ఏపి సీడెడ్ కోసం సురేష్ బాబు ముందుకొచ్చారు. ఫలితంగా శుభంకు చెప్పుకోదగ్గ థియేటర్లు దక్కుతాయి. రిలీజ్ ఛార్ట్ లో మంచి స్క్రీన్లు కనిపిస్తాయి. దీని ద్వారా ప్రేక్షకుల్లో అటెన్షన్ తెచ్చే ప్రయత్నాలు పెంచుకోవచ్చు. ఒకరకంగా సామ్ కు ఇదంతా బలమైన సపోర్ట్ కానుంది. పాజిటివ్ టాక్ వస్తే వీటి మద్దతు మరింత బలమై రెండో వారంలో థియేటర్లు హోల్డ్ చేసుకోవడానికి ఉపయోపడుతుంది. తద్వారా బ్రేక్ ఈవెన్ దాటేసి లాభాలు అందుకోవడానికి ఛాన్స్ ఉంటుంది. కాకపోతే శుభంకి పోటీ పరంగా రిస్క్ లేకుండా అయితే ఉంది. శ్రీవిష్ణు సింగిల్ మీద బజ్ పెరుగుతోంది. ట్రైలర్ వచ్చాక యూత్ దృష్టి దాని వైపు వెళ్ళింది. జగదేకవీరుడు అతిలోకసుందరిని భారీ ఎత్తున 2డి, 3డి లో రీ రిలీజ్ చేస్తున్నారు. వైజయంతి సంస్థ కాబట్టి వీళ్ళ ప్లానింగ్ ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. సో శుభంకు సూపర్ హిట్ టాక్ వస్తేనే వీటిని తట్టుకుంటుంది.

# మెగా ఫ్యామిలీలోకి కొత్త మెంబర్?



టాలీవుడ్లో ఒక సెలబ్రెటీ జంట తల్లిదండ్రులు కాబోతున్నారని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. చాలామంది ఆ జంట అక్కినేని నాగచైతన్యశోభిత ధూళిపాళ్లనే అంటూ వారి ఫోటోలు పెట్టి శుభాకాంక్షలు చెప్పడం మొదలుపెట్టారు. పెళ్లయిన కొన్ని నెలలకే గుడ్ న్యూస్ చెప్పేశారే అంటూ ఆశ్చర్యపోతున్నారు. కానీ చైతూ శోభిత తల్లిదండ్రులు కాబోతున్నారనే వార్త వాస్తవం కాదన్నది లేటెస్ట్ న్యూస్. ఈ శుభ వార్త మెగా ఫ్యామిలీకి సంబంధించినది అట. రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్న ఈ జంట.. ఇప్పుడు తమ కుటుంబంలోకి కొత్త మెంబర్‌ను ఆహ్వానించడానికి సిద్ధమైందట.లావణ్య ప్రెగ్నెంట్ అనే విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. త్వరలోనే అఫీషియల్ న్యూస్ బయటికి రావచ్చు. 2017లో వచ్చిన ‘మిస్టర్’ చిత్రంలో కలిసి పని చేసిన సమయంలో వరుణ్, లావణ్యల మధ్య స్నేహం మొదలై అది తర్వాత ప్రేమకు దారి తీసింది. ఈ జంట ‘అంతరిక్షం’ చిత్రంలోనూ కలిసి నటించింది. అప్పుడే ప్రేమ బలపడిరది. 2023లో ఈ జంట పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత లావణ్య సినిమాలకు దాదాపు దూరమైనట్లే కనిపించింది. ఐతే మూడు నెలల కిందటే ఆమె ప్రధాన పాత్రలో ‘సతీ లీలావతి’ అనే సినిమా మొదలైంది. తమిళంలో ఆమె ‘తనల్’ అనే సినిమాను పూర్తి చేసేసింది. ‘సతీ లీలావతి’ సినిమా చేతిలో ఉండగానే.. లావణ్య ప్రెగ్నెంట్ అనే వార్త బయటికి వచ్చింది.



# అది నాకే దక్కిన అదృష్టం

మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్‌లు కలిసి చేసిన డాన్స్‌కు కొరియోగ్రఫీ అందించడం ఎంత అదృష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ అదృష్టం శేఖర్ మాస్టర్‌కు రెండు సార్లు దక్కడం విశేషం. చిరంజీవి, రామ్ చరణ్ మొదటి సారి మగధీర సినిమాలో పాటలో కనిపించారు. ఆ పాటలో చిరంజీవి ఓల్డ్ వీడియోను గ్రాఫిక్స్‌తో కంపోజ్ చేసి రామ్ చరణ్, చిరంజీవి కలిసి డాన్స్ చేసేలా చూపించారు. ఆ తర్వాత ఆచార్య సినిమాలో చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా నటించడంతో వీరిద్దరి కాంబోలో పాట ఉంది. మొత్తానికి ఈ రెండు సార్లు వారిద్దరూ కలిసి కాలు కదిపారు. రెండు సార్లు కూడా చిరంజీవి, రామ్ చరణ్‌లు కలిసి చేసిన పాటలకు కొరియోగ్రఫీని శేఖర్ మాస్టర్ అందించడం విశేషం. తాజాగా ఆ విషయాన్ని గురించి శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ ‘‘సాధారణంగా చిరంజీవికి కొరియోగ్రఫీ చేయడం అంటేనే చాలా పెద్ద విషయం. అలాంటిది చిరంజీవి, రామ్ చరణ్ కలిసి చేసిన పాటలకు కొరియోగ్రఫీ అందించే అవకాశం రావడం అనేది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇండస్ట్రీలో ఇప్పటి వరకు ఏ కొరియోగ్రాఫర్‌కి దక్కని అదృష్టం నాకే దక్కింది. ఇద్దరినీ కలిపి డాన్స్ చేయించే అవకాశం నాకు దక్కడం, అదీ రెండు సార్లు నాకే దక్కడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను’’అని అన్నారు.

# ప్రభాస్ ‘స్పిరిట్’లో కల్కి బ్యూటీ ?



ఎప్పుడు మొదలవుతుందో స్పష్టమైన సమాచారం లేకపోయినా స్పిరిట్ మీద అభిమానుల అంచనాలు మాములుగా లేవు. అందులోనూ యానిమల్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు సందీప్ వంగా టేకప్ చేస్తున్న మూవీ కావడంతో బిజినెస్ వర్గాల్లో విపరీతమైన డిమాండ్ నెలకొంది. రిలీజ్ ఎప్పుడు ఉన్నా అడ్వాన్స్ ఇప్పుడే తీసుకోమని కొందరు బయ్యర్లు ఒత్తిడి చేస్తున్న వైనం గురించి బాలీవుడ్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం లొకేషన్ల వేటలో దేశదేశాలు తిరుగుతున్న స్పిరిట్ ఇంకో వైపు క్యాస్టింగ్ పనులు కూడా చూసుకుంటోంది. హీరోయిన్ గురించి కీలక లీక్ ప్రస్తుత హాట్ టాపిక్.

విశ్వసనీయ సమాచారం మేరకు ఇందులో హీరోయిన్ గా దీపికా పదుకునే దాదాపు లాకైనట్టు తెలిసింది. ఇంతకు ముందు మృణాల్ ఠాకూర్ అనుకున్నారు కానీ తర్వాతెందుకో నిర్ణయం మార్చుకున్నారట. నిజానికి కల్కి నిర్మాణంలో ఉండగానే సందీప్ దీపికను కలిసి స్పిరిట్ లైన్ చెప్పాడట. కానీ అప్పుడు గర్భవతిగా ఉండటంతో డేట్లు ఇవ్వలేని పరిస్థితి రావొచ్చని భావించి ఇష్టం లేకపోయినా దీపికా నో చెప్పిందట. అయితే రకరకాల కారణాల వల్ల స్పిరిట్ ఆలస్యం కావడంతో ఇప్పుడెలాంటి సమస్య లేదు. షారుఖ్ ఖాన్ కింగ్ తో పాటు స్పిరిట్ కు సమాంతరంగా కాల్ షీట్లు సర్దుబాటు చేసేలా ప్రాధమికంగా ఓకే అయ్యిందని వినికిడి.

సో కల్కి 2 కన్నా ముందే ప్రభాస్, దీపికా జంటగా కనిపించే అవకాశం స్పిరిట్ లో రావొచ్చు. అగ్రెసివ్ పోలీస్ ఆఫీసర్ కథను తెరకెక్కిస్తున్న సందీప్ వంగా ఇందులో హీరోయిన్ పాత్రను ఎలా డిజైన్ చేసి ఉంటాడనే ఆసక్తి కలగడం సహజం. షాలిని పాండే, రష్మిక మందన్నలను చూపించిన విధానమే దానికి నిదర్శనం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# గుజరాత్ టైటాన్స్ ఏడో గెలుపు







ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఆడిన రెండు మ్యాచ్‌లలో నెగ్గిన గుజరాత్ టైటాన్స్ 2-0తో పైచేయి సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో గుజరాత్ 38 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 76; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (37 బంతుల్లో 64; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... సాయి సుదర్శన్ (23 బంతుల్లో 48; 9 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులే చేయగలిగింది. అభిషేక్ శర్మ (41 బంతుల్లో 74; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు.

**పరుగుల వరద...**

తొలి 2 ఓవర్లలో 16 పరుగులతో గుజరాత్ ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. అయితే తర్వాతి 4 ఓవర్లలో ఏకంగా 66 పరుగులు వచ్చాయి. షమీ ఓవర్లో సుదర్శన్ 5 ఫోర్లతో (4, 0, 4, 4, 4, 4) చెలరేగిపోగా, కమిన్స్ ఓవర్లో గిల్ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. హర్షల్ ఓవర్లోనూ సుదర్శన్ 4 ఫోర్లతో దూకుడు ప్రదర్శించాడు. పవర్‌ప్లే ముగిసేసరికి టైటాన్స్ 82 పరుగులు చేసింది. ఆ జట్టుకు ఐపీఎల్‌లో ఇదే అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. తొలి వికెట్‌కు గిల్‌తో 41 బంతుల్లోనే 87 పరుగులు జోడించిన అనంతరం సుదర్శన్ వెనుదిరిగాడు.

ఆ తర్వాత 25 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తయింది. మరోవైపు బట్లర్ కూడా దూకుడు కనబర్చాడు. 22 పరుగుల వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను కమిన్స్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. అన్సారీ ఓవర్లో 6, 4 కొట్టిన బట్లర్ 31 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఉనాద్కట్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్ ఆసక్తికరంగా సాగింది. ఈ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన గుజరాత్...3 వికెట్లు కోల్పోయింది.

**అభిషేక్ పోరాటం వృథా...**

భారీ ఛేదనలో తొలి వికెట్‌కు 49 పరుగులు జత చేశాక ట్రవిస్ హెడ్ (16 బంతుల్లో 20; 4 ఫోర్లు) వెనుదిరిగాడు. అభిషేక్ సిక్సర్లతో ధాటిగా ఆడటంతో పవర్‌ప్లేలో 57 పరుగులు వచ్చాయి. ఇషాన్ కిషన్ (13) పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడగా, అభిషేక్‌కు క్లాసెన్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) సహకరించాడు. 28 బంతుల్లోనే అభిషేక్ హాఫ్ సెంచరీ పూర్తయింది.

అభిషేక్ , క్లాసెన్ మూడో వికెట్‌కు 33 బంతుల్లో 57 పరుగులు జత చేసినా... చేయాల్సిన రన్‌రేట్ పైపైకి వెళ్లడంతో బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. 31 బంతుల్లో 86 పరుగులు చేయాల్సిన స్థితిలో అభిషేక్ అవుట్ కాగా... మరో మూడు బంతులకే క్లాసెన్ కూడా వెనుదిరగడంతో హైదరాబాద్ ఆశలు గల్లంతయ్యాయి. చివర్లో నితీశ్ కుమార్ రెడ్డి (10 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ప్యాట్ కమిన్స్ (10 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కొన్ని షాట్లు ఆడినా అది సరిపోలేదు.



# భారత్‌కు మరో నాలుగు స్వర్ణాలు

ఆసియా అండర్15, 17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. గురువారంతో ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నాలుగు స్వర్ణ పతకాలు జమ అయ్యాయి. ఈ నాలుగు స్వర్ణ పతకాలు బాలికల విభాగంలోనే దక్కాయి. 46కిలోల విభాగంలో ఖుషీ చంద్ 32పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన అల్టానుంజుల్‌ను చిత్తు చేసి బంగారు పతకం చేజిక్కించుకుంది. 50కిలోల విభాగంలో అహనా శర్మ, 54 కిలోల విభాగంలో జన్నత్ ఉజ్బెకిస్తాన్ బాక్సర్లను 50పాయింట్లతో చిత్తుచేశారు. ఇక 80కిలోలకు పైబడిన విభాగంలో అషికా జోర్డాన్‌కు చెందిన జనాను ఓడిరచి భారత్‌కు 15వ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. అలాగే అండర్17 విభాగంలో 60కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్, 63కిలోల విభాగంలో హర్షిక ఫైనల్లో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. చివరిరోజు భారత్‌కు నాలుగు స్వర్ణ, రెండు రజత పతకాలతో సహా మరో ఐదు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 43కు చేరింది. ఈ క్రమంలోనే భారత్ పతకాల పట్టికలో 2వ స్థానంలో నిలిచింది. ఇక కజకిస్తాన్ జట్టు అగ్రస్థానంతో, ఉజ్బెకిస్తాన్ జట్టు మూడో స్థానంలో ముగించాయి.

# రోహిత్, రికెల్టన్ అర్ధసెంచరీలు



వరుస విజయాలతో ప్రత్యర్థి జట్లకు వణికిస్తున్న ముంబయి జట్టు జైపూర్‌లోనూ రాజస్తాన్‌పై అదరగొట్టింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, రికెల్టన్ అర్ధసెంచరీలకి తోడు.. కెప్టెన్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్తాన్ జట్టు 16.1ఓవర్లలో 117పరుగులకే కుప్పకూలింది. బౌల్ట్, కరణ్ శర్మకు మూడేసి, బుమ్రాకు రెండు, దీపక్ చాహర్, హార్దిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయిని ఓపెనర్లు ఆదుకున్నారు. రికెల్టన్(61బీ 38బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లు), రోహిత్ శర్మ(53బీ 36బంతుల్లో 9ఫోర్లు) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 116పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీని రాజస్తాన్ బౌలర్ తీక్షణ విడదీశాడు. ఆ తర్వాత కెప్టెన్ రియాన్ పరాగ్.. రోహిత్ శర్మను ఔట్ చేయడంతో ముంబయి జట్టు 123పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(48బీ 23బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), హార్దిక్(48బీ 23బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) మరో వికెట్ కోల్పోకుండా ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరు 3వ వికెట్‌కు ఏకంగా 94పరుగులు జతచేసి ముంబయి జట్టు 200కు పైగా పరుగులు చేసేందుకు దోహదపడ్డారు. దీంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 217పరుగులు చేసింది. రాజస్తాన్ బౌలర్లు తీక్షణ, రియాన్ పరాగ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో భాగంగా రాజస్తాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రెండో బంతికి డకౌట్ కాగా.. జైస్వాల్ 13 పరుగులు చేశాడు. లోయర్ ఆర్డర్‌లో ఆర్చర్(30) మినహా మిగిలిన ఏ ఒక్క బౌలర్ రాణించలేకపోయాడు. ఈ గెలుపుతో ముంబయి జట్టు 14పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది.

# సింగరేణి ఉద్యోగాల గనిగా మారాలి

(మొదటి పేజీతరువాయి)

మన ముందు తరాల వారు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలమైన సింగరేణి సంస్థను మనకు అందించారని, మనం కూడా మన వారసులకు ఉజ్వల సింగరేణిని అందించకపోతే భావి తరాలకు తీరని నష్టం చేసిన వాళ్లం అవుతామని హెచ్చరించారు. సింగరేణి అభివృద్ధిలో కింది ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందని, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. ఉద్యోగులకు కష్టంగా ఉంటుందని ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందుల పాలవుతామని, నిబంధనలతో, శ్రమతో కూడిన అడుగులు వేయాలన్నారు.

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజా భవన్ లో శుక్రవారం సాయంత్రం ఆయన సింగరేణి కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల లబ్ధి పొందిన వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కారుణ్య ఉద్యోగాలలో గరిష్ట వయో పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరిన ఎదుట దీనిపై తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకరించామని, దీనివల్ల 35 సంవత్సరాల వయో పరిమితి దాటిన అనేక వందల మందికి ఉద్యోగాలు లభించే అదృష్టం దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. సింగరేణి సంస్థ నేడు పోటీ మార్కెట్లో ఇతరులతో పోటీపడి నిలవాల్సిన పరిస్థితి ఉందని, కనుక సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు పనిచేస్తూ కంపెనీని కాపాడుకోవాలని భవిష్యత్తు తరాలకు దీనిని ఒక వారసత్వంగా అందించాలన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని, ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే ప్రతీ ఒక్కరూ శ్రమ శక్తిని చాటాలన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి వారసులు తేలికపాటి ఉద్యోగం కోసం విఫల ప్రయత్నాలు చేయకుండా, ఇచ్చిన పనిని సమర్థంగా నిర్వహిస్తూ కంపెనీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

అదే సమయంలో తమ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 9 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినం జూన్ 2వ తేదీన పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇది లక్షల మందికి ఉపాధి లభించే బృహత్ పథకంగా అమలు చేయనున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా సడలించిన వయోపరిమితి ద్వారా కారుణ్య నియామకం పొందిన 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోపరిమితి సడలింపుకు అంగీకరించి, అనేక కుటుంబాల్లో వెలుగు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ మాట్లాడుతూ వయో పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడం ఒక సంచలనాత్మక నిర్ణయం అని, దీనిపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఉద్యోగంలో చేరిన యువత కష్టపడి పనిచేస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని, గైర్హాజరీలకు పాల్పడవద్దని సూచించారు. ప్రాతినిధ్య కార్మిక సంఘం



ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ మరియు రాష్ట్ర కనీస వేతనాల సలహా సంఘం ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్ మాట్లాడుతూ దేశం లో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి సహకరిస్తుందని, కాంట్రాక్టు కార్మికులకు కూడా 5000 రూపాయల బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. దేశంలో ఏ బొగ్గు సంస్థల్లో లేని విధంగా సింగరేణిలో వయో పరిమితిని 40 ఏళ్ల కు పెంచడం కూడా ఇక్కడనే సాధ్యమైంది అన్నారు. గతంలో ఏ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కృషి చేయనివిధంగా శ్రీ భట్టి విక్రమార్క మల్లు సంస్థ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరో ఆరు గనులు.. 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ (పి అండ్ పి, పర్సనల్) శ్రీ కె.వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీ లక్ష్మీపతి గౌడ్ , జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం శ్రీమతి కవిత నాయుడు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in